


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 01.08.2025 | సంపుటి : 2 | సంచిక :179 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 01.08.2025 | volume : 2 | Issue : 179 | Pages : 8 | Cost : 2/- |



# 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందే

## పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై పార్లమెంట్‌లో సమీక్షించాలి
- బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ, జూలై 31 :** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. ఏ ఎమ్మెల్యే అయినా స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు.. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. రాజకీయ ఫిరాయింపులు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారిందని, అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని తీర్పులో ధర్మాసనం అభిప్రాయపడింది. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలను కూడా పరిశీలించామని సీజేఐ తెలిపారు.

02

సుప్రీం తీర్పుపై నిపుణులతో

## చర్చించి నిర్ణయం

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టీకరణ

02




## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- 3 నెలల్లో ఉప ఎన్నికలు తప్పవు
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

02

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సమర్పణ

- 15 నెలల పాటు విచారించిన కమిషన్
- 115 మందిని విచారించి నివేదిక రూపొందించిన కమిషన్



03

**హైదరాబాద్, జూలై 31 :** కాళేశ్వరంపై విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. ఇందులో కెసిఆర్, హరీష్ రావు, ఈటెల రాజేదర్ సహా నీటిపారుదల శాఖ అధికారులను విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు.

## సిగాచి ప్రమాదంపై హైకోర్టులో పిల్

### ప్రభుత్వానికి నోటీసులు జారీ

సంగారెడ్డి సిగాచి పరిశ్రమ ప్రమాదంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. సిగాచి పరిశ్రమ ప్రమాదంపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.



03



06

## బంగారం కోసం వెతుకులాట

చైనాలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బంగారం షాపు



## దేశ ప్రయోజనాలపై రాజీపడేది లేదు

- ట్రంప్ వాణిజ్య సుంకాలపై పీయూష్ గోయల్
- లోక్‌సభలో ప్రకటించిన కేంద్రమంత్రి

06



02

## మద్యం సీసా తిరిగిస్తే.. రూ.20 వాపస్

కేరళ ప్రభుత్వం వినూత్న నిర్ణయం

## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభించాలి

### నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభిం చాలని.. డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో మిగిలిన పనిని పూర్తి చేయాలని నీటిపారు దలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. నీటిపారుదల శాఖపై సంబంధిత అధికారులతో మంత్రి గురువారం సచివాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్జీఆ ర్ఐ, జీఎస్ఐ తో కలిసి ఎలక్ట్రోమేగ్నటిక్ సర్వేను ఉపయోగించి ఎస్ఎల్‌బీసీ పనులు చేస్తు న్నట్లు చెప్పారు.



02


## పాక్‌ను చేరదీస్తున్న ట్రంప్

- పాక్‌తో కలసి చమురు నిల్వల అభివృద్ధి
- పాక్ ఎప్పటికైనా భారత్‌కు చమురు విక్రయించగలదని వ్యాఖ్య

**వాషింగ్టన్, జూలై 31 :** భారత్‌పై కత్తికట్టిన ట్రంప్ పాక్‌ను దువ్వే ప్రయత్నంలో ఉన్నారు. పాకిస్తాన్ తో కలిసి చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి పనిచేస్తామని ప్రకటించారు. అంతేకాకుం డా పాకిస్తాన్ ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మవ చ్చని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో మేము ఇప్పుడే ఒక ఒప్పందాన్ని చేసుకు న్నాం. దీని ద్వారా పాకిస్తాన్, యునైటెడ్ స్టేట్స్ వారి భారీ చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి కలిసి పనిచేస్తాయి. ఈ భాగస్వా మ్యానికి నాయకత్వం వహించే చమురు కంపెనీని మేము ఎంచుకునే పక్రియలో ఉన్నాము. బహుశా వారు ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మే అవకాశం ఉందని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. భారతదేశంపై 25శాతం సుంకం, భారత్, రష్యన్ సైనిక పరికరాలు, ఇంధన కొనుగోలుపై అదనపు జరిమానా ప్రకటిం చిన కొన్ని గంటల తర్వాత ట్రంప్ ఈ పోస్ట్ చేశారు.



04



04

## విజయ్ దేవరకొండ కేసు విచారణ

తీర్పును వాయిదా వేసిన హైకోర్టు



04

## సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు షాక్

- ముందస్తు బెయిల్ రద్దు చేసిన సుప్రం
- మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం

## తిరుమలలో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

హెచ్చరించిన టిటిడి అధికారులు



03



03

## సరోగసి పేరుతో సృష్టిలో మోసాలు

రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన పోలీసులు

## యూపీఐ లావాదేవీలు..

### పేటీఎం, గూగుల్‌పేకు ఐసీఐసీఐ షాక్

యూపీఐ ఆధారిత లావాదే వీల వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. గల్లీ దుకాణాల దగ్గర్నుంచి మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతు న్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు సిద్ధమైంది




07

## సుప్రీం తీర్పుపై నిపుణులతో
# చర్చించి నిర్ణయం
### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టీకరణ



**హైదరాబాద్, జూలై 31 :** ఫిరాయింపుల ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. తనకు మూడు నెలల గడువు విధించడంపై న్యాయ నిపుణులతో చర్చించాకే తదుపరి నిర్ణయానికి వెళ్తామని అన్నారు. ఈ క్రమంలో ధన్‌ఖడ్ వ్యాఖ్యల ప్రస్తావన తెచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు పై న్యాయ నిపుణులతో చర్చిస్తా. మాజీ ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ ఏం మాట్లాడారో అందరూ చూశారు. వాటిని కూడా మేము పరిశీలిస్తున్నాం. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం. సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించాకే అన్ని వివరాలు త్వరలో చెప్తా అని అన్నారు. ఇదిలా ఉంటే.. పార్టీ మారిన పది మందిపై తొలుత తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో.. విచారణ షెడ్యూల్ కోసం సింగిల్ బెంచ్ జడ్జి తెలంగాణ స్పీకర్‌కు నాలుగు వారాల గడువు విధించారు. అయితే డివిజనల్ బెంజ్ దానిని కొట్టేసింది. ఇక ఇవాళ్టి తీర్పులో ఫిరాయింపులపై చర్యల విషయంలో స్పీకర్‌కు సుప్రీం కోర్టు మూడు నెలల కాలపరిమితి విధించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి, గవర్నర్‌లకు గడువు విధిస్తూ సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉప రాష్ట్రపతి హోదాలో ఓ కార్యక్రమానికి హాజరైన ధన్‌ఖడ్.. సుప్రీం కోర్టుపై తీవ్ర వ్యాఖ్యలే చేశారు. పార్లమెంటే సుప్రీం అని. ఎన్ని-కై-న ప్రజాప్రతినిధులే రాజ్యాంగ ప్రకారం అల్టిమేట్ మాస్టర్స్ అని అన్నారాయన. 'సుప్రీం కోర్టు రాష్ట్రపతికి గడువు విధించడం తగదు. ఇప్పుడు జడ్జీలు శాసనాలు చేస్తారు, కార్యనిర్వాహక విధులు నిర్వర్తిస్తారు, సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు' అని విమర్శించారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్య శక్తులపై అణుక్షిపణి ప్రయోగించకూడదు అని తీవ్ర వ్యాఖ్య చేశారాయన. అయితే.. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్న పిటిషన్ విచారణ సమయంలో సుప్రీం కోర్టు పరోక్షంగా ధన్‌ఖడ్ వ్యాఖ్యలపై స్పందించింది. ఇప్పుడు మేమే కార్యనిర్వాహక వ్యవస్థలో జోక్యం చేస్తున్నామన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాం. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వాలా? అంటూ ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందే

- పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయం
- ఫిరాయింపులపై పార్లమెంట్ సమీక్షించాలి
- బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ, జూలై 31 :** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను అనుమతించిన సుప్రీం ధర్మాసనం.. వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అదే సమయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ గవాయ్ ఆదేశించారు. కాగా, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసుపై సుప్రీంకోర్టులో సుధీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై సుప్రీంకోర్టులో సుధీర్ఘ వాదనలు నడిచాయి. ఈ వాదనల అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. బిఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోపు నిర్ణయించాలని సూచించింది. ఏ ఎమ్మెల్యే అయినా.. స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చు. రాజకీయ ఫిరాయింపులు జాతీయ చర్చనీయాంశంగా మారింది. దాన్ని అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని వ్యాఖ్యానించారు. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంటులో చేసిన వివిధ ప్రసంగాలను కూడా పరిశీలించాం. రాజేష్ పైలట్.. దేవేంద్ర నాథ్ మున్ని లాగా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడంలో డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ 2014 నవంబర్ 22న తీర్పును పక్కన పెడుతున్నాము. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు సంవత్సరాల తరబడి సాగడం అర్థరహితంగా అని పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే స్పీకర్ ఎమ్మెల్యేలకు నోటీసు జారీ చేయడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించింది. అపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం తీర్పు వెలువడింది. దీనిని బిఆర్ఎస్ నేతలు స్వాగతించాలి.

# సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- 3 నెలల్లో ఉప ఎన్నికలు తప్పవు
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**హైదరాబాద్, జూలై 31 :** 'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు. దేశం యొక్క ప్రజాస్వామ్య నిర్మాణం హానికరమైన పద్ధతుల ద్వారా క్షీణించకుండా చూసుకున్నందుకు గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తికి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాలను పటిష్టం చేయాలని, ఫిరాయింపులపై ఆటోమేటిక్ రద్దు చేయాలని తన పంచ న్యాయ్‌లో వాదించిన రాహుల్ గాంధీ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను. మిస్టర్ గాంధీ, మీ స్వంత ఉపదేశాలకు కట్టుబడి ఉండమని నేను మీకు చెబుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. గౌరవనీయులైన స్పీకర్ పదవిని మీరు, మీ పార్టీ భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికి ఉపయోగించుకోరని నేను ఆశిస్తున్నాను. ఈ 10 మంది ఎమ్మెల్యేలు అక్రమంగా కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రతిరోజూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అంగీకరించడానికి పెద్దగా పరిశోధన అవసరం లేదు అని కేటీఆర్ తెలిపారు.

## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను
# తక్షణమే పునఃప్రారంభించాలి
### నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, జూలై 31 :** ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభిం చాలని.. డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో మిగిలిన పనిని పూర్తి చేయాలని నీటిపారు దలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖపై సంబంధిత అధికారులతో మంత్రి గురువారం సచివాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్జీఆ ర్ఐ, జీఎస్ఐ తో కలిసి ఎలక్ట్రోమేగ్నటిక్ సర్వేను ఉపయోగించి ఎస్ఎల్‌బీసీ పనులు చేస్తున్నట్లు చెప్పారు. కచ్చితమైన ప్రణాళిక, ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు వీలుగా లైడార్ సర్వే వేగవంతం చేయాలన్నారు. "వానాకాలం పంట కోసం జలశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలి. మొత్తం ఆయకట్టుకు నీరు అందేలా చూడాలి. ఇందు కోసం జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలి. నీరు లేక రైతులు ఎవరూ ఇబ్బంది పడొద్దు. శాఖ మొత్తం దూరదృష్టితో, జవాబుదారీతనంతో పనిచేయాలి. వర్షాకాలం నేపథ్యంలో యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో సంభవించే అతి భారీ వర్షాలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలి. అన్ని జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టాలి. నీటిపారుదలశాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల్లో ఆక్రమణలు గుర్తించి తొలగించాలి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. స్థానిక మున్సిపల్, పోలీసు శాఖలను సంప్రదించి ఆక్రమణలు తొలగించాలి. డిప్యూటీ ఇంజినీర్లు మొదలు ఇంజినీర్ ఇన్ చీఫ్ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో పదోన్నతుల ప్రక్రియ రెండు నెలల్లో పూర్తి చేయాలి"అని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం

- సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రూపకల్పన
- క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**వనపర్తి, జూలై 31 :** సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగం సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు. తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటం ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధుల తో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా విధానం2025 తెలంగాణ క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అంద జేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- బాధ్యతలు మరింత విస్తరించ బోతున్నాయని వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన వివరించారు. ఒక ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## మీరు చెప్పే రాజ్యాంగాన్ని ఆచరిస్తారా?
### సుప్రీం తీర్పుపై రాహుల్‌కు హరీష్ రావు ప్రశ్న



**హైదరాబాద్, జూలై 31 :** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని హరీశ్‌రావు ప్రస్తావిస్తూ.. మీరు బోధించే వాటిని మీరు ఆచరించగలరా..? అని రాహుల్ గాంధీని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. మీ తండ్రి దివంగత రాజీవ్ గాంధీ 52వ రాజ్యంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్పీకర్‌ను మీరు కోరుతారా..? అని ప్రశ్నించారు. లేదా రాజ్యాంగాన్ని చేతిలో మోసుకెళ్లడం కేవలం ఎన్నికల మోసమా..? అని రాహుల్ గాంధీని హరీశ్‌రావు నిలదీశారు.



## ముగిసిన అమెరికా కాన్సూల్ జనరల్ పదవీకాలం
### జెన్నిఫర్ లార్సన్‌కు శ్రీధర్ బాబు ఆత్మీయ వీడ్కోలు



**హైదరాబాద్, జూలై 31 :** హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ – అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం, దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ తెలంగాణ –అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాక్షించారు.

# పాక్‌కు చెక్.. చీనాబ్‌పై 'సావల్‌కోట్' ప్రాజెక్టు



**జమ్మూ కశ్మీర్ :** సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన భారత ప్రభుత్వం భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఇటీవలే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టగా, తాజాగా భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది. కశ్మీర్‌లోని చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు 40 ఏళ్లుగా పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే, ఇటీవల సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేయడం.. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం దశాబ్దం క్రితమే మొదలుపెట్టగా.. కొంత ఖర్చు కూడా చేసినట్లు సమాచారం. 2021లో కేంద్రం జోక్యం చేసుకుని ఎన్‌హెచ్‌పీసీని భాగస్వామ్యం చేయడంతోపాటు పలు కీలక ఒప్పందాలను చేసుకుంది. అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చివరగా పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది. సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు ఉన్నాయి. దీంతో భారీ స్థాయిలో నీరు నిల్వ చేసే అవకాశం లేకుండా పోయింది. ఏదైనా ప్రాజెక్టు ప్రారంభించాలన్నా.. పాక్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. తాజాగా ఆ ఒప్పందం నిలిచిపోవడంతో ఎటువంటి అనుమతులు, సమాచారం పంచుకోవడం అవసరం లేదు.

## మద్యం సీసా తిరిగిస్తే..
# రూ.20 వాపస్..
### కేరళ ప్రభుత్వం వినూత్న నిర్ణయం

**కేరళ :** పొద్దు కుంకితే చాలు.. బార్లు, వైన్ షాప్‌ల ముందు 'క్యూ' చూస్తూనే ఉంటాం. ఉచితంగా ఇస్తున్నారా? అన్న చందంగా మందుబాబులు ఆవురావురుమంటూ ఎగబడుతుంటారు. మద్యం తాగేసి ఆ బాటిల్‌ను పక్కకు విసిరేస్తారు. దీంతో ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ బాటిళ్లు దర్శనమిస్తుంటాయి. వారి తీరును మార్చేందుకు కేరళ ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి మద్యం బాటిల్‌పై అదనంగా రూ.20 ముందస్తు డిపాజిట్ చేయనున్నట్లు ప్రకటించింది. మళ్లీ అదే అవుట్‌లెట్‌లో బాటిల్‌ను తిరిగి ఇస్తే... డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇవ్వనున్నట్లు తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా బేవరేజస్ కార్పొరేషన్ ద్వారా ఏడాదికి 70 కోట్ల సీసాల మద్యం విక్రయిస్తున్నట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో ప్రధాన ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిదారుగా నిలిచింది. మొత్తం అమ్ముడవుతున్న మద్యం బాటిళ్లలో కేవలం 56 కోట్ల బాటిళ్లు మాత్రమే రీసైకిల్ అవుతున్నాయి. మిగతావన్నీ వ్యర్థాలుగా మిగిలిపోతున్నాయి. దీనిని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇదే విషయాన్ని ఆ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ఎం.బి. రాజేశ్ వెల్లడించారు. వీలైనంత వరకు గాజు సీసాల్లోనే మద్యం నింపాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అంత సులువు కానందువల్ల రూ.800 అంతకంటే ఎక్కువ ధర పలికిన మద్యాన్ని గాజు సీసాల్లోనే ఇవ్వాలని, రూ.800 కంటే తక్కువ ధర కలిగిన మద్యాన్ని ప్లాస్టిక్ బాటిళ్లలో సరఫరా చేసుకోవచ్చని ప్రభుత్వం వెల్లడించింది. సెప్టెంబరులో కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుల కింద దీనిని చేపట్టి.. జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే తరహా విధానాన్ని తమిళనాడు ఇప్పటికే అనుసరిస్తోంది.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సమర్పణ

- 15 నెలల పాటు విచారించిన కమిషన్
- 115 మందిని విచారించి నివేదిక రూపొందించిన కమిషన్



**హైదరాబాద్, జూలై 31 :** కాళేశ్వరంపై విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. ఇందులో కెసిఆర్, హరీష్ రావు, ఈటెల రాజేదర్ సహా నీటిపారుదల శాఖ అధికారులను విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 ఆఖర్లో కుంగడం, పియర్స్ దెబ్బతినడంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు- నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ-(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు- విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు- వెంటనే కమిషన్ ఏర్పాటు-కు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు- ఉత్తర్వులు జస్టిస్ ఘోష్‌కు ఏప్రిల్‌లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఇవాళ జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.



## నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

### ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్

**హైదరాబాద్, జూలై 31 :** తెలంగాణ హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్ వీరితో ప్రమాణం చేయించారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న ఆమోదముద్రవేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది. మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి.



## సరోగసి పేరుతో సృష్టిలో మోసాలు

### రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన పోలీసులు

**హైదరాబాద్, జూలై 31 :** సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో దారుణాలు సాగించిన డాక్టర్ నమ్రత కేసులో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఐవిఎఫ్ కోసం వచ్చిన వారిని సరోగసీ వైపు దారిమళ్లించి లక్షలు దండుకున్నట్లు గుర్తించారు. నమ్రతను 5 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన కీలక అంశాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. సరోగసీ చేయకపోయినా చేసినట్లు నమ్మించి పలువురు దంపతులను మోసం చేశారని.. ఈ విషయాన్ని డాక్టర్ నమ్రత అంగీకరించారని పేర్కొన్నారు. రాజస్థాన్ దంపతులనూ సరోగసీ విషయంలోనూ నమ్రత మోసం చేశారు. వాళ్లు డీఎన్ఏ పరీక్షల నివేదికలు కావాలని అడగడంతో.. విషయం బయట పడుతుందని తప్పించుకున్నారు. కొన్ని రోజుల సమయం ఇస్తే తప్పును సరిదిద్దుతామని వారికి చెప్పారు. వినకపోవడంతో తన కుమారుడితో రాజస్థాన్ దంపతుల్ని బెదిరించారు. సరోగసీ పేరుతో 'సృష్టి'సెంటర్ చాలా మోసాలు చేసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే వారిని సరోగసీ వైపు మళ్లించి డబ్బులు దోచుకున్నారు. ఏపీలో కొంతమంది ఏఎన్ఎంల సహాయం కూడా తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి అనస్థీషియన్ డాక్టర్ సదానందం వీరికి పూర్తిస్థాయిలో సహకరించారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## సిగాచి ప్రమాదంపై హైకోర్టులో పిల్

### ప్రభుత్వానికి నోటీసులు జారీ




**హైదరాబాద్, జూలై 31 :** సంగారెడ్డి సిగాచి పరిశ్రమ ప్రమాదంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. సిగాచి పరిశ్రమ ప్రమాదంపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిగాచిపై న్యాయవాది కె.బాబూరావు పిల్ దాఖలు చేశారు. పరిశ్రమలో భద్రతా చర్యలు తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. పేలుడు ఘటనలో ఇంకా 8 మంది ఆచూకీ దొరకలేదని హైకోర్టుకు తెలియజేశారు. బాధితులకు ప్రకటించిన పరిహారం ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని, సిగాచి పరిశ్రమ యజమానిని ఇప్పటివరకు అరెస్టు చేయలేదని.. ప్రమాదంపై ఏర్పాటు- చేసిన కమిటీ- నివేదిక బయటపెట్టాలని పిటిషనర్ కోరారు.ఇదిలా ఉండగా.. ఫ్యాక్టరీలలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఇకపై అన్ని జిల్లాల్లో కెమికల్, ఫార్మా, హై-రిస్క్ పరిశ్రమలన్నింటికీ చెక్ లిస్ట్‌ను ప్రకటిస్తామన్నారు. నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిగాచి ఫ్యాక్టరీ ఘటనలో ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన సాధారణ సూచనలను పాటించి ఉంటే, కంపెనీకి రూ. 20 నుంచి రూ. 25 లక్షలకు మించి ఖర్చు అయ్యేది కాదన్నారు. ఇప్పుడు ప్రమాదం జరగడం వల్ల రూ. 50 కోట్ల పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.



## మంచిరేవులలో చిక్కిన చిరుత

**హైదరాబాద్, జూలై 31 :** గత 12 రోజులుగా అధికారులకు కంటి మీద కునుకులేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు చిక్కింది. మంచిరేవులలో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత పడిందని అధికారులు ప్రకటించారు. దీనిని నల్లమల్ల అడవిలో వదిలిపెట్టనున్నట్లు- తెలిపారు. నగర శివారులో గత రెండు వారాలుగా చిరుత సంచారం జనాలను భయాందోళనకు గురి చేస్తూ వచ్చింది. మృగవని పార్క్ గ్రేహౌండ్స్ పరిధిలో చిరుత సంచారం కలకలం రేపింది. దీనిని బంధించేందుకు 8 ట్రాప్ కెమెరాలు, 4 బోనులు ఏర్పాటు- చేశారు అధికారుల. అయినా అది చిక్కకుండా అధికారులను ముప్పు తిప్పలు పెట్టింది. ఈ క్రమంలో గత అర్ధరాత్రి దాటాక మొయినాబాద్ ఎకోటిక్ పార్క్‌లో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత చిక్కింది. దీనిని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలి పెడతామని అధికారులు తెలిపారు.



## పార్లమెంటు ఆవరణలో బాలకృష్ణ సందడి

- స్పీకర్ ఓంబిర్లతో మర్యాదపూర్వక భేటీ
- సమస్యలపై మనోహర్ లాల్ ఖట్టర్‌కు వినతులు

**న్యూఢిల్లీ, జూలై 31 :** పార్లమెంటు ఆవరణలో నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ- అయ్యారు. తన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులు సమర్పించారు. అంతకుముందు బాలకృష్ణకు తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తాను రోజూ పార్లమెంటుకు వచ్చేందుకు ఉపయోగించే సైకిల్‌ను చూపించారు. దీంతో బాలయ్య అక్కడ సరదాగా కాసేపు సైకిల్ నడిపారు. అనంతరం టీడీపీ ఎంపీలతో కలిసి స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్‌ను ఘనంగా సన్మానించి పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఆ తరువాత కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులను ఆయనకు సమర్పించారు. తెలుగు దేశం పార్టీ ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న పార్టీ అని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ పాటుపడుతోందని బాలకృష్ణ ఈ సందర్భంగా అన్నారు. ప్రస్తుతం డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ అఖండ-2 మూవీలో నటిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సింహా, లెజెండ్, అఖండ బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలోని 4వ చిత్రమిది. అఖండ-2 బ్లాక్ బస్టర్ మూవీ అఖండకు సీక్వెల్. కాగా, ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానున్నట్లు సమాచారం.

## రైల్వేలపై సమాచారహక్కు చట్టం కింద ఆరా

- విభజన చట్టం ప్రకారం కాజీపేట రైల్వే కోచ్
- ఏపీకి విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు

**హైదరాబాద్, జూలై 31 :** సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి సమాధానం వచ్చింది. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయి దాదాపు దశాబ్దకాలం దాటేసింది. ఈ క్రమంలో రెండు రాష్ట్రాలకు ఏం దక్కింది అనే ప్రశ్నకు రైల్వేల నుంచి వివరణ వచ్చింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలులో భాగంగా.. రైల్వే మంత్రిత్వ శాఖ విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించింది. ఇదే క్రమంలో తెలంగాణలోని కాజీపేటలో రైల్వే కేచ్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు బదులిచ్చింది. దీనికి తోడు ఏపీ రాజధాని అమరావతిని ఇతర ప్రాంతాలతో కలిపేందుకు రైల్వే స్టేషన్లను నిర్మించనున్నట్లు- ప్రకటించింది. ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు స్టార్ట్ అయినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ సునీల్ ప్రభాత్ వివరాలను అందిస్తూ.. చట్టంలోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన షెడ్యూల్ 13లోని 8, 10 ,11 అంశాలు మంత్రిత్వ శాఖకు సంబంధించినవని.. ఈ ప్రాజెక్టుల అమలు ప్రస్తుతం వివిధ దశల్లో ఉందని స్పష్టం చేశారు. షెడ్యూల్ లోని 8వ అంశం కింద కొత్తగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాని మోదీ జనవరి 8న శంకుస్థాపన చేశారు. భవనాల నిర్మాణానికి టెండర్లు కూడా పిలవబడ్డాయి. షెడ్యూల్ లోని 10వ అంశం కింద వివిధ రకాల ఆధునిక రైల్వే స్టాక్‌లను తయారు చేసి నిర్వహించగల సామర్థం గల రైలు తయారీ యూనిట్‌ను తెలంగాణలోని కాజీపేటలో అభివృద్ధి చేయాలని భారతీయ రైల్వే ఎ÷-లాన్ చేసింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ అనుమతి మంజూరై రైల్ వికాస్ నిగమన్ లిమిటెడ్‌కి అప్పగించబడింది. ఇక షెడ్యూల్ లోని 11వ అంశం కింద ఏపీ కొత్త రాజధాని అమరావతికి ప్రత్యక్ష రైలు కనెక్టివిటీ-ని అందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఎర్రుపాలెం-నంబూరు వయా అమరావతి అనే 56.53 కిలోమీటర్ల కొత్త లైన్ మంజూరు చేయబడింది.

## స్పీకర్‌కు సుప్రీం సూచనలు మాత్రమే చేసింది

- గతంలో ఫిరాయింపులను మరచిన బిఆర్ఎస్
- మీడియా సమావేశంలో మండపడ్డ అద్దంకి



**హైదరాబాద్, జూలై 31:** ఎమ్మెల్యేల అనర్హ తపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మా త్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అ ద్దంకి దయాకర్ అన్నారు. దీనిపై ఎవరికి వారు వక్ర భాష్యాలు చెబుతున్నారని అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభా హక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిం దంటూ భారత రాష్ట్ర సమితి నాయకు లు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. గతంలో వారు చేసిన ఫిరాయింపుల గురించి మాట్లాడాలని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు వారు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది వారే. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు. మేం ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని బతికించాం అన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడి సమర్థించుకోవడం బిఆర్ఎస్ నేతలకే దక్కిందని అన్నారు. ప్రతిపక్ష హోదా ఉన్నా అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై మేం కోర్టుకు వెళ్లాలా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాంఅని అద్దంకి దయాకర్ అన్నారు. ఇలాంటి వారు చట్టాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.



## తిరుమలలో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

### హెచ్చరించిన టిటిడి అధికారులు

**తిరుమల, జూలై 31 :** రీల్స్ పిచ్చిలో కొందరు తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్నారు. అలాగే స్వామికి అపచారం చేస్తున్నారు. దీనిపై టిటిడి తీవ్రంగా స్పందించింది. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడ వీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు, డ్యాన్స్‌లతో సోషల్ మీడియా రీల్స్ చేస్తుండటంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని తితిదే విజిలెన్స్ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని తితిదే పేర్కొంది. పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని.. ఇక్కడ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కావాలని సూచించింది. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తితిదే తెలిపింది.



## అభివృద్ధి కోసమే ఫిరాయించా : ఎమ్మెల్యే తెల్లం

**భద్రాచలం, జూలై 31 :** భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటుపై సుప్రీంకోర్టు తీర్పును శిరసా వహిస్తానని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకటరావు అన్నారు. కోర్టు తీర్పులపై తమకు గౌరవం ఉందన్నారు. ప్రజాప్రతినిధిగా భద్రాచలం అభివృద్ధి కోసమే అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో తనకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్న ఆయన.. ఒకవేళ ఉపఎన్నికలు వచ్చినా మళ్లీ గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి తనకు ముఖ్యమని అన్నారు. వెనకబడ్డ భద్రాచలం విషయంలో తాను నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి ఎలా ఉంది..?

- పెండింగ్‌లో ఉన్న హైవే విస్తరణ పనుల పూర్తికి తీసుకుంటున్న చర్యలేంటి..?
- ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా ఇచ్చిన కనెక్షన్లు ఎన్ని..?
- 2020 నుంచి చిన్న పరిశ్రమల మూసివేతకు కారణాలను గుర్తించారా..?

**ఢిల్లీ:** తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాల్లో జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి ఎలా ఉంది? అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా.. గురువారం మూడు అంశాలపై ప్రశ్నించారు. జాతీయ రహదారులతో పాటు.. ప్రధానమంత్రి ఉజ్వల యోజన ( పీఎంయువై ) కనెక్షన్లు, సూక్ష్మ మరియు మధ్యస్థ పరిశ్రమల మూసివేతకు కారణాలపై ప్రశ్నించారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖల సహాయ మంత్రి సురేష్ గోపి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే లు వేరువేరుగా లిఖిత పూర్వక సమాధానాలు ఇచ్చారు.

- జాతీయ రహదారులకు సంబంధించి.. సంబంధిత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ.. భారత్ మాల పరియోజనలో భాగంగా.. 2017లో దేశవ్యాప్తంగా 34,800 కి. మీ. జాతీయ రహదారుల నిర్మాణాన్ని రూ. 5.35 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందులో 20,070 కి. మీ ఇప్పటికే నిర్మించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 1,719 కి. మీ. మేరా నిర్మాణాలకు గాను.. 874 కి. మీ. పూర్తయినట్లు చెప్పారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్నిచోట్లా సకాలంలో పూర్తి చేస్తామని వివరించారు.



- ప్రధానమంత్రి ఉజ్వల యోజన ( పీఎంయువై) పురోగతిపై కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి.. సమాధానమిస్తూ.. పేద వయోజన మహిళలకు డిపాజిట్ రహిత ఎల్ పీ జీ కనెక్షన్లను అందించే లక్ష్యంతో 2016 లో ప్రారంభించామని, 8 కోట్ల కనెక్షన్ల లక్ష్యాన్ని సెప్టెంబర్ లో సాధించామని తెలిపారు. మిగిలిన అర్హులైన పేదల కోసం.. 2021లో చేపట్టిన ఉజ్వల 2.0 ద్వారా 2022 డిసెంబర్ లో 1.60 కోట్ల కనెక్షన్ లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నాటి గణాంకల ప్రకారం 10.33 కోట్ల పీఎంయువై కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని మహిళలు కట్టెల పొయ్యిని వీడేలా చేసి, శ్వాసకోశ ఇబ్బందులను దూరం చేసి, వారి జీవితాల్లో ఈ పథకం గణనీయ ప్రభావం చూపిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2019-20 లో 1,48,480 కనెక్షన్లు, ఉజ్వల 2.0 కింద 2023-24 లో 32,890, ఈ ఏడాది ఇప్పటివరకు 336 కనెక్షన్లు మంజూరు చేసినట్లు వివరించారు.
- సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే సమాధానం ఇస్తూ... సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల ( ఎంఎస్ఎంఈ ) రిజిస్ట్రేషన్ పోర్టల్ 2020లో ప్రారంభమైనట్లు తెలిపారు. పరిశ్రమలు, సంస్థల ద్వారా..దేశ వ్యాప్తంగా 28.49కోట్ల మంది ఉపాధి,ఉద్యోగ అవకాశాలు పొందారని, తెలంగాణకు సంబంధించి 2020- 21 లో 1.63 లక్షల మంది, 2025 -26కు సంబంధించి 1.23 లక్షల మంది ఉన్నట్లు గణాంకాలు తెలిపారు. జిడిపిలో ఎగుమతి వాటా 2023 -24 లో 45. 73 శాతం ఉందని, నకిలీ రిజిస్ట్రేషన్, కంపెనీ యజమాని మార్పు.. తదితర కారణాలతో 0.15 శాతం చిన్న తరహా పరిశ్రమలు మూతపడినట్లు వివరించారు.

## సంపాదకీయం

# ప్రధాన సమస్యలపైనా చర్చలు ఏవీ?



పార్లమెంటులో ఎంపిలకు ప్రజల సమస్యలు పట్టడంలేదు. ఆపరేషన్ సిందూర్‌పై ఎట్టకేలకు చర్చ సాగింది. దీనిపైనా ఈకలు పీకాలని చూశారు. దేశ సార్వభౌమత్వానికి, దేశ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయాల్లో కూడా విపక్షాలు ఐక్యత ప్రదర్శించలేక పోయారు. అన్నింటికి మించి సిందూర్ పేరు పెట్టడంపై జయాబచ్చన్ అభ్యంతరం తెలపడం ఆమె అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. పేరు ఏది పెట్టాలి.... ఉగ్రవాదులను ఎప్పుడు చంపాలి... ఉగ్రవాదులు పాక్‌కు చెందిన వారేనా...కాశ్మీర్‌లోకి వారెలా వచ్చారు... ఎందుకు యుద్ధం ఆపారు.. వంటి సమస్యలు తప్ప ఉగ్రమూకలను ఉసిగొల్పిన పాక్‌ను పీచమణిచామా లేదా అన్నది ఎవ్వరూ మాట్లాడలేదు. ఏం మాట్లాడితే రాజకీయంగా లబ్ది కలుగుతుందో అదే మాట్లాడాలని విపక్ష సభ్యులు నిర్ణయించారు. వారు కాలం గడిపితే చాలని అధికార బిజెపి పక్షం కూడా ఆశిస్తోంది. అసలు సమస్యలు ప్రస్తావించడం బిజెపికి కూడా ఇష్టం లేదు. బీహార్ ఓట్ల సవరణ కూడా ఇలాంటిదే. దీనిపై రచ్చ చేయడం ద్వారా లబ్ధిపొందాలన్న లక్ష్యం తప్ప ప్రజలపై వీరికి ప్రేమ లేదు. ప్రజలు ఏమైతే మాకేంటన్న ధోరణితో మన ఎంపిలు పార్లమెంటును ఉపయోగించుకుంటున్నారు. ధర్మస్థలిలో ఆక్రందనలు వినిపించడం లేదు. అక్కడ అధికారంలో కాంగ్రెస్ న్యాయబద్ధమైన తక్షణ విచారణకు పూనుకోలేదు. కేవలం సిట్ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీనిని అత్యవసర కేసుగా గుర్తించి, అక్కడ నిజంగానే అమ్మాయిలన మానప్రాణాలు పోయాయా అని తర్కించడం లేదు. మహిళా ఎంపిలకు కూడా ధర్మస్థలి గురించి చర్చించాలన్న ఆలోచన రాకపోవడం దుర్మార్గం. సిందూర్ పేరెందుకు పెట్టారన్న జయాబచ్చన్ కనీసం ధర్మస్థలి ఘోరాలపై దృష్టి పెట్టివుంటే ఆమెను అభినందించేవారు.

ఇకపోతే పార్లమెంటులో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క సమస్య చర్చకు రావడం లేదు. ప్రజలు ఉద్యోగాలు లేక, ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిని ఎలా అధిగమిద్దామనే విషయంలో చర్చ లేదు. ఒక్కొక్క ఎంపి లక్షల్లో జీత భత్యాలు తీసుకుంటున్నారు. వారికి ప్రజల ఈతిబాధలు పట్టడం లేదు. ఎందుకంటే.. ఇటీవలి కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు ప్రముఖ కంపెనీలు రాత్రికిరాత్రే ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. వీరంతా రోడ్డున పడుతున్నారు. కేవలం ఖర్చులు తగ్గించుకునే క్రమంలో ఇలా చేస్తున్నారు. వీరి ఉద్యోగాలు పోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉద్యోగభద్రత లేకుండా చేస్తున్న కంనెనీలపై చర్యలు లేవు. కోటి ఆశలతో ఐటి రంగాన్ని ఎంచుకున్న యువతరంలో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్న ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు మారిపోతోంది. ఏ రోజు ఉద్యోగం ఉంటుందో, ఏ రోజు ఊడుతుందో తెలియని దుస్థితి నెలకొంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), ఇన్ఫోసిస్ లాంటి సంస్థలు ఎడాపెడా ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. టిసిఎస్ తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు- కొద్దిరోజుల క్రితం ప్రకటన చేసింది. టిసిఎస్ ఒక్కటే 12 వేల మందిని ఇంటికి పంపనుందని సమాచారం. పిడుగుపాటు లాంటి ఈ ప్రకటనతో టిసిఎస్ ఉద్యోగుల్లో కలకలం రేగింది. ఒక్క టిసిఎస్సే కాదు, ఇన్‌ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రోల వంటి సంస్థలదీ ఇదే బాట.

ఉద్యోగులను తొలగించడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో మిడ్‌లెవల్, సీనియర్ మేనేజర్లే అత్యధికులు. మన దేశంలో కొంతకాలంగా టెక్‌రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది. సంస్థలు నష్టాల్లో లేనప్పటికీ, గతంతో పోలిస్తే లాభాలు ఆశించినట్లు లేవని చెబుతున్నారు. ఫలితంగా ఐటి సేవల్లో మందగమనం చోటుచేసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవు తోంది. గ్లోబల్ క్లయింట్లకు తక్కువ ఖర్చుతో సేవలందించడమన్నది భారత టెకీ రంగం ప్రధాన వ్యూహంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే.సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా 40 అంతకన్నా ఎక్కువ వయసున్న వారు ఉద్యోగాలను కోల్పోతే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. చేస్తున్న ఉద్యోగాలపై ఉన్న నమ్మకంతో చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న దుస్థితి అక్కడక్కడా కనపడుతోంది. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని సంస్థలు ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నాయి. అనధికారికంగా పనిగంటలు పెంచడం, పని ఇవ్వకుండా బెంచ్‌పై ఉంచి బెదిరింపులకు పాల్పడటం వంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తీవ్ర అభద్రతా భావం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చోటుచేసుకుంటోంది. మరోవైపు ఈ రంగంలో తగ్గుతున్న ఉద్యోగాల ప్రభావం హైదరాబాద్, బెంగళూరు వంటి చోట్ల అనుబంధ రంగాలపై కూడా పడుతున్నట్లు- పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కంపెనీల లాభనష్టాల లెక్కలు ఎలా ఉన్నప్పటికీ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. విధి నిర్వహణకు అవసరమైన నైపుణ్యాల పెంపు బాధ్యతను సంస్థలే స్వీకరించాలి. ఆ సాకుతో ఉద్యోగాలను తొలగించడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ బతుకులలో పెరుగుతున్న సంక్షోభంపై ఉద్యమించాల్సి ఉంది. దేశీయ సంస్థలే కాదు, గ్లోబల్ టెక్ కంపెనీగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ సంస్థ 15వేల మంది ఉద్యోగులను ఇళ్లకు పంపింది. మే నెలలో ఆరువేల మందిని, జులైలో 9వేల మందిని ఆ సంస్థ తొలగించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో ఇది నాలుగు శాతం! క్లౌడ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆ సంస్థ తొలగిస్తోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 61వేల మందికిపైగా టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ తదితర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారు. 2019 తరువాత నుండి ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నియామకం దాదాపు సగానికి పైగా తగ్గిపోయింది. రానున్న రోజుల్లోనూ ఈ పరిణామం కొనసాగనుంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 'ఎఐ ఫస్ట్' సంస్కరణల్లో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయంటూ సత్య నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. భారీ లాభాలు వస్తున్నప్పటికి ఉద్యోగులపై వేటు- వేయడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తోంది. దీనికి ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణాలను చెబుతూ తప్పించుకుంటున్నాయి. వీటిపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఈ సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించాల్సి ఉంది. ప్రభుత్వం కూడా సమాధానం ఇవ్వాల్సి ఉంది.

# సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు షాక్

- ముందస్తు బెయిల్ రద్దు చేసిన సుప్రం
- మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం



**న్యూఢిల్లీ, జూలై 31 :** ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరిం చింది. ఇకపోతే సంజయ్ కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై గత విచారణ సందర్భంగా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు- ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు.. ఇదెలా సాధ్యం అని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు.. అన్ని చూసుకోవాలి గానీ, ఇష్టానుసారం చేస్తే ఎలా అని సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజ య్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థ కు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ- నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ -టె-క్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు చెల్లించారు. సదస్సులు మొ త్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించక పోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వా నికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# ధర్మస్థలి మిస్టరీ మరణాలపై దర్యాప్తు

### పారిశుధ్య కార్మికుడి చూపిన చోట తవ్వకాలు.. కొన్ని అవశేషాల గుర్తింపు

**బెంగళూరు, జూలై 31 :** కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల'లో అనుమానస్పద మరణాల మిస్టరీపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టింది. ఇందులో ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. పారిశుధ్ధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఈ అనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మృత దేహాలను పూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా.. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం.లో ఇటీవల మిస్టరీ మరణాలపై దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు- అనుమానాలున్నట్లు- పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతం లోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

# సుప్రీం తీర్పు రేవంత్‌కు చెంపపెట్టు


### బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద




**హైదరాబాద్, జూలై 31 :** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు- పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేకానంద తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ స్పీకర్ దగ్గర ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడం చరిత్రాత్మకం అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఈ తీర్పు చెంపపెట్టు లాంటింది. ఉపఎన్నికలు ఎలా వస్తాయి అధ్యక్షా అని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టును తప్పుపట్టేలా వ్యాఖ్యానించారు. ఇపుడు ఉపఎన్నికలు ఎలా వస్తాయో సుప్రీం కోర్టు చెప్పింది అని వివేకానంద తెలిపారు. సీఎం అధికార మదంతో రాచరికాన్ని తలపించేలా మాట్లాడిన వ్యాఖ్యలకు విరుద్ధంగా సుప్రీం తీర్పు ఇచ్చింది. సుప్రీం తీర్పు మీద ఏ మాత్రం నమ్మకమున్నా పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి. పార్టీ మారగానే ఎమ్మెల్యేలు, ఎంపీలు సభ్యత్వాన్ని కోల్పోయేలా చట్టం తెస్తామని ఏఐసీసీ మేనిఫెస్టోలో చెప్పారు. పాంచ్ న్యాయ్ సూత్రాల్లో అది ఒకటని రాహుల్ చెప్పారు. ఏ మాత్రం తాను మేనిఫెస్టోలో పెట్టిన దానిపై గౌరవమున్నా రాహుల్ ఎమ్మెల్యేల అనర్హత వేటు కోసం చొరవ చూపాలి అని వివేకానంద పేర్కొన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీది ఓ మాట.. గల్లీలో రేవంత్ రెడ్డిది ఇంకో మాట. ద్వంద్వ ప్రమాణాలకు కాంగ్రెస్ చిరునామాగా మారింది. రేవంత్ ఫిరాయింపులను ప్రోత్సహించడానికి వ్యతిరేకంగా సుప్రీం తీర్పు వచ్చింది. సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ ఆహ్వానిస్తుంది. ఇక మూడు నెలలు ఆగకుండా స్పీకర్ వెంటనే తన నిర్ణయం ప్రకటించాలి. సుప్రీంకోర్టు తాజా తీర్పు మా పార్టీ తొలి విజయం.. ఈ విజయ పరంపర కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా బుద్ధి తెచ్చుకుని వ్యవహరించాలి అని ఎమ్మెల్యే వివేకానంద మండిపడ్డారు.

# పాక్‌ను చేరదీస్తున్న ట్రంప్

- పాక్‌తో కలసి చమురు నిల్వల అభివృద్ధి
- పాక్ ఎప్పటికైనా భారత్‌కు చమురు విక్రయించగలదని వ్యాఖ్య



**వాషింగ్టన్, జూలై 31 :** భారత్‌పై కత్తికట్టిన ట్రంప్ పాక్‌ను దువ్వే ప్రయత్నంలో ఉన్నారు. పాకిస్తాన్ తో కలిసి చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి పనిచేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా పాకిస్తాన్ ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మవచ్చని పేర్కొన్నారు. పాకిస్తాన్ తో మేము ఇప్పుడే ఒక ఒప్పందాన్ని చేసుకున్నాం. దీని ద్వారా పాకిస్తాన్, యునైటెడ్ స్టేట్స్ వారి భారీ చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి కలిసి పనిచేస్తాయి. ఈ భాగస్వామ్యానికి నాయకత్వం వహించే చమురు కంపెనీని మేము ఎంచుకునే పక్రియలో ఉన్నాము. బహుశా వారు ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మే అవకాశం ఉందని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. భారతదేశంపై 25శాతం సుంకం, భారత్, రష్యన్ సైనిక పరికరాలు, ఇంధన కొనుగోలుపై అదనపు జరిమానా ప్రకటించిన కొన్ని గంటల తర్వాత ట్రంప్ ఈ పోస్ట్ చేశారు. వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈసందర్భంగా భవిష్యత్తులో భారత్‌కు పాక్ చమురు విక్రయించవచ్చని వ్యాఖ్యానించారు. భారత దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, పాక్‌ల మధ్య ఒక వాణిజ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఇరుదేశాలు చమురు నిల్వలను పెంచుకోవడంలో కలిసి పనిచేస్తాయన్నారు. అందుకోసం ఒక మంచి చమురు కంపెనీని ఎంచుకునే పక్రియలో ఉన్నామన్నారు. దీని కారణంగా భవిష్యత్తులో భారత్‌కు పాక్ చమురు విక్రయించొచ్చు అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. ఇక, వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి అనేక దేశాల నాయకులతో మాట్లాడానని ట్రంప్ పేర్కొన్నారు. వారంతా యూఎస్‌ను సంతోషపెట్టాలని చూస్తున్నారన్నారు. అదేవిధంగా మరికొన్ని దేశాలు సుంకాల తగ్గింపు కోసం ప్రతిపాదనలు చేస్తున్నాయని తెలిపారు. ఇవన్నీ వాణిజ్య లోటును తగ్గించడంలో సహాయపడతాయన్నారు. ఈ ఒప్పందంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందిస్తూ.. ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం భవిష్యత్తులో తమ భాగస్వామ్యం కొనసాగేందుకు ఉపయోగపడుతుందన్నారు.టారిఫ్‌లు ప్రకటించిన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. సుంకాలపై భారత్‌తో ఇంకా చర్చలు జరుపుతున్నామ న్నారు. ఈసందర్భంగా మరోసారి బ్రిక్స్‌ను ప్రస్తావించారు. యూఎస్‌కు వ్యతిరేకంగా, డాలర్‌ను అణగదొక్కాలని బ్రిక్స్ దేశాలు చూస్తున్నాయని ఆరోపించారు. భారత్ కూడా ఆ కూటమిలో భాగమేనన్నారు. కానీ, అది జరగనివ్వనని స్పష్టంచేశారు. భారత ప్రధాని మోదీ తనకు మంచి స్నేహితుడని ఉద్ఘాటించారు. అయితే, వారు పెద్దఎత్తున సుంకాలు విధిస్తున్నారని ప్రస్తుతం వాటిని తగ్గించేందుకు ఆ దేశం సిద్ధమైందని పేర్కొన్నారు. మరోవైపు ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నట్లు- భారత్ తెలిపింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.



# విజయ్ దేవరకొండ కేసు విచారణ

### తీర్పును వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్, జూలై 31 :** సినీ హీరో విజయ్ దేవరకొండ దాఖలు చేసిన ఫిటిషన్‌పై గురువారం తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్ పై తీర్పు వాయిదా వేసింది. గతంలో విజయ్ దేవరకొండ ఓ మూవీ ఈవెంట్‌లో గిరిజనులను కించపరిచేలా, వారి ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ గిరిజన సంఘాల నాయకులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని విజయ్ దేవరకొండ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విజయ్ తరఫు న్యాయవాది కోర్టులో ఇవాళ తన వాదనలు వినిపించారు. విజయ్ వ్యాఖ్యలు చేసిన రెండు నెలలు తరువాత గిరిజన నాయకులు ఫిర్యాదు చేశారని, ఇందులో దురుద్దేశం ఉందని ఆయన కోర్టుకు తెలిపారు. విజయ్ దేవరకొండ సామాజిక మాధ్యమాల్లో క్షమాపణ కూడా చెప్పారని హైకోర్టుకు వివరించారు. అయితే సోషల్ మీడియాలో చెప్పిన క్షమాపణలు పరిగణలోకి తీసుకోకూడదని ప్రతివాదుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరువురి వాదనలు ముగియడంతో హైకోర్ట్ తీర్పును వాయిదా వేసింది.

# భారత ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం

### కేంద్రంపై రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, జూలై 31 :** భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవ స్థితిలో ఉందని ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ మినహా అందరికీ తెలుసునని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బిజెపి నాశనం చేసిందని ధ్వజమెత్తారు. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విమర్శ గురించి పార్లమెంట్ ఎదుట గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. అవును, ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈవిషయం తెలుసునని అన్నారు. ట్రంప్ వాస్తవాన్ని వెల్లడించినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. ఇందులో ఆశ్చర్యం లేదని, అదానీకి సహాయం అందించడం కోసం బిజెపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందని, ఆవిషయాన్ని ట్రంప్ స్పష్టం చేస్తారని, ట్రంప్ చెప్పినట్లు ప్రధాని మోడీ చేస్తారని అన్నారు. భారతదేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన తర్వాత, భారత్,రష్యాల ఆర్థిక వ్యవస్థలు నిర్జీవమైనవని అమెరికా అధ్యక్షులు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఎమ్మెల్యేల అనర్థ పిటిషన్‌పై తీర్పు

### స్వాగతించిన తెలంగాణ బిజెపి

**హైదరాబాద్, జూలై 31:** పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బిజెపి స్వాగతించింది. ఈ తీర్పను తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమ న్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయిం పులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీ-లు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటుందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.



## హెూంగార్డ్ కూతురు ఉషాశ్రీని అభినందించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ నందు హెూంగార్డుగా నిధులు నిర్వహిస్తున్న నాగయ్య కూతురు ఉషశ్రీ ఇంటర్మీడియట్ నందు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఉషశ్రీ ని అభినందించి సిబ్బంది సంక్షేమంలో భాగంగా నగదు బహుమతి అందించారు. భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు, కష్టపడి చదువుకోవాలని క్రమశిక్షణగా ఉండాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమం నందు అడ్మిన్ అతను ఎస్పీ రవీందర్ రెడ్డి, అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి,డిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ హరిబాబు, ఆర్ఎస్ఐలు ఎం.అశోక్,కే. అశోక్,సాయిరాం,పోలీస్ సంఘ అధ్యక్షులు రాంచందర్,పోలీస్ సంఘం సభ్యులు వెంకన్న ఉన్నారు.



## ఎస్ఐ ఎండి.శఈదుద్దీన్‌కి ఘనంగా వీడ్కోలు


### వికారాబాద్ జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నందు ఎస్ఐగా విశేష సేవలందించి పదవీ విరమణ పొందుతున్నఎస్ఐ ఎండి.శఈదుద్దీన్ ను గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎండి.శఈదుద్దీన్ ని సన్మానించారు. ఎండి.శఈదుద్దీన్ ఉమ్మడి మెదక్ జిల్లా పోలీస్ శాఖలో తన ప్రస్థానాన్ని ఒక కానిస్టేబుల్‌గా ప్రారంభించారు. అంచెలంచెలుగా హెడ్ కానిస్టేబుల్‌గా, ఏ.ఎస్.ఐ.గా, ఆపై ఎస్ఐగా పదోన్నతులు పొంది, మొత్తం 38 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు అంకితభావంతో సేవలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎండి.శఈదుద్దీన్ సుదీర్ఘ సేవలను, అంకితభావాన్ని, క్రమశిక్షణను ఎంతగానో కొనియాడారు. 38 ఏళ్లకు పైగా ఎలాంటి రిమార్క్ లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించడం నిజంగా ప్రశంసనీయంఅని ఆయన సేవలు యువ సిబ్బందికి ఎంతగానో స్ఫూర్తిదాయకం అని ఎస్పీ అన్నారు. పోలీస్ ఉద్యోగం ఎంతో సవాలుతో కూడుకున్నదని, కుటుంబ సభ్యుల సహకారం లేనిదే ఇంత సుదీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేయడం సాధ్యం కాదని వారి త్యాగాలను కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ ఒక ముఖ్యమైన ఘట్టమని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, ఎలాంటి మచ్చ లేకుండా పదవీ విరమణ చేస్తున్న ఎండి.శఈదుద్దీన్ కి ఎస్పీ అభినందనలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత ఆయన తన కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఎస్పీ గారు ఎండి.శఈదుద్దీన్‌ని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ పివి.మురళీధర్, ఏఓ జోతిర్మని, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, ఇతర పోలీస్ అధికారులు, డి.పి.ఓ. సిబ్బంది, ఎండి.శఈదుద్దీన్ గారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవాణి విద్యాలయానికి నూతన బస్సు అందజేసిన పూర్వ విద్యార్థి

**భువనగిరి, రాజముద్ర న్యూస్ :** భువనగిరి పట్టణంలోని స్థానిక విద్యానగర్ పరిధిలోని శ్రీవాణి విద్యాలయం ప్రైవేటు పాఠశాలలో శ్రీ పిన్నపురెడ్డి శ్రీధర్ రెడ్డి, కంట్రోల్ ఎస్ డాటా సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఫౌండర్ వీరు గతంలో శ్రీవాణి విద్యాలయంనందు



విద్యభ్యాసం పూర్తి చేసి ఉన్నత స్థాయికి వెళ్ళి కంట్రోల్ ఎస్ డాటా సెంటర్ సంస్థను ఏర్పాటు చేసుకొని లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పిస్తూ చదువుకున్న పాఠశాలను మర్చిపోకూడదని మరియు తన జీవితానికి మైలురాయి పాఠశాల విద్య అని భావించి , ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఉచితంగా కొత్త బస్సు సౌకర్యం కల్పించాలనే ఒక గొప్ప సంకల్పంతో 24 లక్షల రూపాయల విలువగల నూతన బస్సుని శ్రీవాణి విద్యాలయానికి వారి తండ్రి పిన్నపురెడ్డి మోహన్ రెడ్డి చేతుల మీదుగా శ్రీవాణి విద్యా సమితి అధ్యక్షులు పులిమామిడి బాలకృష్ణారెడ్డికి అందజేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కొరకై వివేరా హెూటల్స్ రిసార్ట్స్ అధినేత రాష్ట్ర హెూటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు, సద్ది వెంకట్ రెడ్డి ఒక లక్ష రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ ఎస్ మరొక డైరెక్టర్ ఆర్.ఎస్. ప్రసాద్ పరిసరాల పరిశుభ్రత – పరిరక్షణ గురించి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, భవిష్యత్తులో కూడా ఈ పాఠశాల అభివృద్ధికై తమ వంతు సహకారం తప్పకుండా అందజేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పాఠశాలలో అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యని అందిస్తూ... ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నందుకు పాఠశాల యాజమాన్యాన్ని ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. అదే విధంగా తమ సహకారం పాఠశాల అభివృద్ధికై ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మా పాఠశాల అభివృద్ధి కొరకై విద్యార్థుల సౌకర్యార్థం నూతన బస్సుని అందజేసిన పిన్నపురెడ్డి శ్రీధర్ రెడ్డి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసిన సద్ది వెంకటరెడ్డి కి శ్రీ వాణి పాఠశాల యాజమాన్యం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం అనంతరం దాతలకు పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి విద్యాలయం హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం, ప్రిన్సిపాల్ పులుగం. నరసింహారెడ్డి , ఆర్ ఎస్. ప్రసాదరావు డైరెక్టర్ కంట్రోల్ ఎస్ డాటా సెంటర్ , పాఠశాల కన్వీనర్ కోశాధికారి బొక్క మాధవ రెడ్డి , పాఠశాల కరస్పాండెంట్ మంచికంటి వెంకటేశం,శ్రీవాణి విద్యా సమితి డైరెక్టర్లు కన్నయ్య , సోమిరెడ్డి , మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొనడం జరిగింది.

# విదేశీ వాణిజ్య ఒప్పందం మన దేశ ప్రయోజనాలకు ప్రమాదకరం

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మోడీ ప్రభుత్వం విదేశీ వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) పై సంతకం చేయడానికి అమెరికా సామ్రాజ్యవాద ఆదేశాలకు లొంగిపోతోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. వ్యవసాయం, పాడి, ఆహార మార్కెట్ రంగాలకు ద్వారాలు తెరవడంతో ఇది మొత్తం ప్రజల, దేశం ప్రయోజనాలను దెబ్బతీస్తుందని తెలిపారు. ఎఫ్‌టిఎ 2025 ఆగస్టు ఒకటి నాటికి అమల్లోకి రానుందని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లను అంగీకరించి, జిఎం ఆహారాలు, ఆహార మార్కెట్లలో ఎంఎన్‌సి చొరబాటుతో సహా ఆహారం, పాల వస్తువుల దిగుమతులను పెంచడానికి తీసుకున్న చర్యలను వ్యతిరేకించాలని అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు శ్యామయ్య అధ్యక్షతన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు – పరిష్కారాలు అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా శోభన్ హాజరై మాట్లాడుతూ... అమెరికా పౌరుడి తలసరి వార్షిక ఆదాయం 43,239 డాలర్లు. ఆ దేశంలో వ్యవసాయంపై ఆధారపడినవారు దాదాపు 12 లక్షల మంది మాత్రమే. రైతుల సాగు ఖర్చులపై అక్కడి ప్రభుత్వం 110 శాతం పంట సబ్సిడీనిస్తుంది. మన దేశంలో8 శాతానికి మించి సబ్సిడీలను ఇవ్వడం లేదని అన్నారు. మన దేశ మార్కెట్ లలో అమెరికన్ కంపెనీలు ప్రవేశిస్తే ప్రస్తుత ధరకన్న తక్కువకు అమ్మితే మన రైతు బ్రతకగలుగుతాడా అని ప్రశ్నించారు. ఈ సుంకాలతో పోటీ పడలేక దివాళా తీస్తారని అన్నారు. ఇంగ్లాండ్‌తో చేసుకున్న భారత స్వేచ్ఛావాణిజ్య ఒప్పంధం జాతీయ ప్రయోజనాలకు ప్రమాధకరం. వ్యవసాయం, మధ్యతరహా పరిశ్రమలకు పలు సవాళ్ళను తెస్తుందన్నరు. రైతులు, మత్స్య కారులు, పశు పెంపకం దార్లు వివర్శిస్తున్నప్పటికీ గొర్రెలు, సాల్మన్ చేపలు, సాఫ్ట్ డ్రింక్, చాక్లెట్స్, బిస్కెట్లు, వైద్యపరికరాలు, కాస్మొటిక్ లు, విద్యుత్ యంత్రాలు, అంతరిక్ష పరికరాలు మన మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున ఏ ఆటంకాలు లేకుండా దిగుమతి అవుతాయని ఇంగ్లాండ్, భారత ప్రభుత్వాల ప్రకటన ఇవి రైతులు, మత్స్యకారులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సవాళ్ళుగా మారతాయన్నరు. ముఖ్యంగా ఆహార శుద్ధి పరిశ్రమలు దెబ్బతింటాయి, గత ఒప్పంధాల మాదిరిగానే ఇప్పటి ఒప్పంధం ఉ ందన్నరు. భారత వ్యవసాయం, తయారి రంగాలల్లో సంక్షోభాన్ని



మరింత తీవ్రతరం చేస్తాయి. ఇటువంటి ఒప్పంధాలు కనీసం పార్లమెంట్‌లో చర్చకు నోచుకోకుండా చేసుకోబడుతున్నాయి, కేంద్ర ప్రభుత్వం మరో సామ్రాజ్యవాద పాలనకు దేశంలో అవకాశం కల్పిస్తుందన్నరు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ ఒప్పంధం నుండి వై తొలగాలని, అమెరికాతో జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంధ చర్చలనుండి తప్పుకోవాలని అన్నారు. మన రైతుల ప్రయోజనాలను కాపాడాలని ఎరువుల కొరతను రైతులు ఎదుర్కుంటున్నారు. 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయిస్తే 6.60 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. 4.23 లక్షల టన్నుల యూరియా లోటు ఏర్పడిందని అన్నారు. అందువల్ల సాగులో యాజమాన్యం నిర్ణయాలు ఆచి, తూచింతేసుకోవాలన్నరు. సాగు అంటే కేవలం పంటల్ని పండించడం కాదు. పంటల సాగులోవచ్చే ఉప ఉత్పత్తులను వినియోగించుకుంటూ ఇతర ఉత్పత్తులైన పాడి పశువుల పెంపకం, కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం చాలా ముఖ్యమని, పంటల ఎంపికలో వాతావరణ ఒడిదుడుకులను ఎదుర్కొనే విధంగా ఉండాలని అన్నారు. సాగునీటి వనరులు బదులుగా, పంటల రక్షణకు ఉపయోగపడే విధంగా వాడుకోవాలి. వరి స్థానంలో పప్పు ధాన్యాలు, నూనె గింజలు సాగును చేపట్టాలి. బోర్లు,బావుల కింద తక్కువ నీరు అవసరమయ్యే పైర్లను సాగు చేయాలి. నీరు నిల్వ అంతగా ఉండని భూముల్లో పత్తిని వేయరాదు. బోర్లు, బావుల కింద స్వయంగా శ్రమతో పండించుకునేవారు, అధిక విలువ ఇవ్వగల కూరగాయలను పండించుకోవాలి. మార్కెట్ ఒడిదుడుకులను, వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా పండ్ల తోటలను పెంచుకోవాలని అన్నారు. పశుపోషణ స్థిర ఆదాయం ఇస్తుందని చిన్న, సన్నకారు రైతులు పశుపోషణను సాగులో అనుబంధ వృత్తిగా చేపట్టాలన్నారు. దీనికోసం నీటి వసతి గల భూమిలో కొంత భాగం పశుగ్రాస పెంపుకు కేటాయించాలి. పెరటికోళ్ళ పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే గొర్రెలు, మేకల పెంపకాన్ని చేపట్టాలి. గొర్రెలు, మేకల పెంపకంలో బహిరంగ ప్రదేశాల్లో తిప్పి మేపే బదులు దొడ్లోనే మేపాలని, సాగులో ఉత్పత్తి ఖర్చును తగ్గించుకునే ప్రభుత్వం చేయాలి. సొంత విత్తనం వాడకం ఉత్పత్తి ఖర్చును తగ్గించడానికి ఒక మంచి ఉదాహరణ. విత్తన శుద్ధి సస్యరక్షణ ఖర్చును తగ్గిస్తుంది. భూ ఆరోగ్య కార్డులు సూచించిన విధంగానే ఎరువులను వాడాలి. అధిక రసాయనిక ఎరువుల వాడకం అలవాటు తగ్గించుకోవాలని తెలిపారు. పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకాల్ని అనుబంధ సాగు చేపట్టినప్పుడు, సేంద్రీయ ఎరువు కమతం స్థాయిలోనే అధికంగా వస్తుందన్నరు. సమగ్ర పోషణ యాజమాన్యం పైర్లను చీడ, పీడల నుండి రక్షిస్తూ సస్య రక్షణ యాజమాన్య ఖర్చును తగ్గిస్తుందన్నరు. సస్య రక్షణ యాజమాన్యంలో కంపెనీల ప్రచారాన్ని నమ్మకూడదు, దగ్గరలో ఉన్న వ్యవసాయ శాఖ, వ్యవసాయ నిపుణుల సూచనల ఆధారంగా చేపట్టాలి. వ్యవసాయ రంగాన్ని, ఆహార ధాన్యాల ఉత్పత్తిని, పాడి రంగాన్ని దెబ్బతీసే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం, చౌక దిగుమతులను వెనక్కి తీసుకోవాలి. సమాఖ్య హక్కులను బలహీనపరిచే, ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్ స్వాధీనం చేసుకోవడాన్ని ప్రోత్సహించే కార్పొరేట్ అనుకూల ఎన్ పిఎఫ్ఎఎంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు సి2ప్లస్50 శాతం కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతు ఆత్మహత్యలను నివారించడానికి రైతులు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణ మాఫీ చేయాలని తెలిపారు. విచక్షణారహితంగా భూసేకరణ, భూ సమీకరణ పథకాలు, పారిశ్రామిక నమూనా టౌన్‌షిప్‌లు ఆపాలన్నారు. భూసేకరణ చట్టం 2013ను అమలు చేయాలని, విద్యుత్‌ను ప్రైవేటీకరించకూడదని తెలిపారు. స్మార్ట్ మీటర్లను బిగించొద్దు అన్ని గ్రామీణ గృహాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శ్యామయ, జిల్లా కార్యదర్శి మద్దులపల్లి సుదర్శన్, ఉపాధ్యక్షులు ఆర్ మహిపాల్, సతీష్, లక్ష్మయ్య బొజ్జాయా వల్యానాయక జమలోదిన్, అనసూయ, లక్ష్మి, రాజు, బస్వరాజు, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## డిపిఆర్ఓ రమేష్ కుమార్ అంకితభావంతో పని చేశారు

- ఫోర్త్ ఎస్టేట్‌గా పత్రిక రంగం
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** డిపిఆర్ఓగా విధులు నిర్వహించిన రమేష్ కుమార్ అంకిత భావంతో పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి సమాచారం ప్రజలకి చేరే విధంగా విధులు నిర్వహించారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ అన్నారు. గురువారం కలెక్టరెట్ కార్యాలయంలోని సమావేశ మందిరం లో డిపిఆర్ఓ పదవి విరమణ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అధికారులు మంచి బృందంగా ఏర్పడి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లెందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డి పి ఆర్ ఓ గా విధులు నిర్వహించిన రమేష్ జిల్లాలో మంత్రుల కార్యక్రమాలు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులని సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. బయట తినుబండారాలు తినకుండా ఇంటి ఆహరం మాత్రమే తీసుకొని ఆరోగ్యంపై చాలా శ్రద్ధ తీసుకునేవారని తెలిపారు. తదుపరి జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాక్షించారు. సమాచార శాఖ 4 వ ఎస్టేట్ గా అడ్వాన్స్ టెక్నాలజి ని ఉపయోగించుకుంటు సమాజానికి దిశ నిర్దేశం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ డి పి ఆర్ ఓ గా జిల్లాలో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహించారని మంత్రుల కార్యక్రమాలు,ముఖ్యమైన సమావేశాలు రాత్రి ఆలస్యం అయినా మీడియా మిత్రులను సమన్వయము చేసుకుంటూ అన్ని పేపర్ లో వచ్చే విధంగా కృషి చేసేవారని తెలిపారు. గత 30 సంవత్సరాలుగా ఐపిఆర్ శాఖ లో వివిధ హెూదాలో విధులు నిర్వహించెందుకు కుటుంబ సభ్యుల సహకారం ఏంతో ఉందని తదుపరి ఆయురారోగ్యలతో ఉండాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అన్నారు. పదవి విరమణ పొందిన డి పి ఆర్ ఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ 1996 జనవరి 19 న ఐపిఆర్‌శాఖ విధుల్లో చేరినానని కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, భూపాలపల్లి,వివిధ హెూదాలలో విధులు నిర్వహించి సూర్యాపేట కి 5 సెప్టెంబర్ 2022 న అదనపు పౌర సంబంధాల అధికారిగా విధుల్లో చేరినారని 18 కలెక్టర్ ల వద్ద పని చేసానని ఇంత మంచిగా జిల్లా అభివృద్ధి కోసం పని చేస్తున్న యువ కలెక్టర్ ని ఎక్కడ చూడలేదని అలాగే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రామ లక్ష్మణుల సమన్వయము చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారని అలాగే జిల్లా అధికారులు కుడా మంచిగా పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో డిఎఫ్ ఓ సతీష్ కుమార్,సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు,జిల్లా అధికారులు, ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## న్యాయవాది ఇస్మాయిల్ స్ఫూర్తితో న్యాయవాదుల సమస్యల పరిష్కారంకై పోరాడుదాం

### ఐలు జిల్లా అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్

**భువనగిరి రాజముద్ర న్యూస్ :** ప్రముఖ న్యాయవాది, ఐలు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి. ఇస్మాయిల్ స్ఫూర్తితో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకై ఐక్యంగా పోరాడుదామని ఐలు జిల్లా అధ్యక్షులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. బొల్లెపల్లి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో ఎండి. ఇస్మాయిల్ 2వ వర్ధంతి సందర్భంగా న్యాయవాదులతో కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఎండి ఇస్మాయిల్ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని, పేదలకు, ప్రజలకు చట్టపరంగా వస్తున్న సమస్యల విషయంలో వృత్తిపరంగా వారికి అండగా ఉంటూ పరిష్కారంలో ముందు బాగాన ఉన్నారని తెలిపారు. నేటికీ న్యాయవాదులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఇప్పటికైనా 2019 ఎన్రోల్మెంట్ అయిన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, కార్పస్ ఫండ్ ను రూ.500 కోట్లకు పెచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ వారు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి గౌడ్, సీనియర్ న్యాయవాదులు వి. దామోదర్ రెడ్డి, నాగారం అంజయ్య, ఎం.ఏ రహీం, జి. బాబురావు పాల్గొని మాట్లాడగా పి. లింగారెడ్డి, కేశవరెడ్డి, నరసింహ యాదవ్, విద్యాసాగర్, గోద వెంకటేశ్వర్లు, ఎండి. నేహాల్, రేణుక, యం. చంద్రశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా మెడి ఫిక్స్ మెడికల్ షాప్ ప్రారంభోత్సవం

### ముఖ్యఅతిథిగా టీపీసీసీ చీఫ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లి నియోజక వర్గం కొండాపూర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడి ఫిక్స్ మెడికల్ షాపును ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నాతో పాటు ప్రభుత్వ సలహాదారులు అరకర్ వేణుగోపాల్, నా మిత్ర బృందం హాజరు కావడం జరిగింది. నిత్యం బీద ప్రజాజనానికి అందుబాటులో ఉండాల్సినటువంటి మెడికల్ ఫీల్డ్ ను ఎంచుకున్నందుకు మైదం బాలకృష్ణ వారి అబ్బాయికి ఈ ఫీల్డ్ లో మంచి విజయం సాధించాలని, సేవలు అందించాలని కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మెడి ఫిక్స్ ఫార్మసీ మెడికల్ షాప్ యజమాన్యానికి మైదం బాలకృష్ణ, మైదం సాయి చరణ్ కి శుభాకాంక్షలు తెలిపారు. విజయవంతంగా బిజినెస్ జరగాలని ఇంకా బ్రాంచెస్ పెట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు : బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, రాజకీయ నాయకులు, హారకర్ వేణుగోపాల్, నాగభూషణం, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ గుప్తా, లకపతి గౌడ్, రమ్య రావు, రాజముద్ర తెలుగు దినపత్రిక విలేకర్ పరమేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీడీసీకి రూ.2వేల కోట్ల ఆర్థిక సాయం

### కేంద్ర క్యాబినెట్ నిర్ణయం



**న్యూఢిల్లీ :** నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు ఆర్థిక సాయాన్ని ఇచ్చేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద నాలుగేళ్లపాటు దీన్ని అందించనుంది. రుణాల కింద మరిన్ని నిధులు సమకూర్చుకోవడానికి తాజా చర్య ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో 8.25లక్షలకు పైగా ఉన్న సహకార సంఘాల్లోని 29 కోట్ల మంది సభ్యులకు ఈ కార్పొరేషన్ రుణాలు అందిస్తుంది. వీరిలో 94శాతం మంది రైతులే ఉన్నారు. కేంద్రం అందించే ఈ ఆర్థిక సాయం ద్వారా అదనంగా మరో రూ.20వేల కోట్ల రుణాలను ఎన్‌సీడీసీ సమకూర్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్‌సీడీసీ రుణ రికవరీ రేటు 99.8శాతంగా ఉండగా.. సున్నా ఎన్‌పీఏ ఉన్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.




## అండమాన్ నికోబార్‌లో తొలిసారి 'ఈడీ' సోదాలు

**న్యూఢిల్లీ :** ఓ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఈడీ తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఓ సహకార బ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపీ కుల్దీప్‌రాయ్ శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు పోర్ట్ బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు (ఏఎన్ఎస్‌సీబీ) ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి.. బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. ఈ రుణాల్లో చాలావరకు నగదు రూపంలో ఉపసంహరించుకుని.. గతంలో బ్యాంకు వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన కుల్దీప్‌రాయ్ శర్మకు, ఇతరులకు ముట్టజెప్పినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ నెల 18న శర్మను అరెస్టు చేశారు. ఈ నెల 29న కోర్టు ఆయన్ను మూడు రోజుల పోలీసు కస్టడీకి పంపింది.




## విమానంలో కుదుపులు..

### అత్యవసర ల్యాండింగ్

**సాల్ట్ లేక్ సిటీ :** డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కుదుపులకు లోనైంది. దీంతో ఈ విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. అసలేం జరిగిందంటే.. బుధవారం డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం సాల్ట్ లేక్ సిటీ నుంచి ఆమ్‌స్టర్‌డామ్‌కు బయలుదేరింది. ఈక్రమంలో విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో విమానాన్ని మినియాపొలిస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో 25 మందికి పైగా ప్రయాణికులకు గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే వైద్యసిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందించారు. ఈ ఘటన సమయంలో విమానంలో 275 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. డెల్టా ఎయిర్ లైన్స్ కూడా దీన్ని ధ్రువీకరించింది. అయితే ఈ కుదుపులకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపింది. ఇక, విమానంలో కుదుపులు చోటుచేసుకున్నప్పుడు ప్రయాణికులకు గాయాలవడం చాలా అరుదు. అయితే, ప్రస్తుత వాతావరణంలో మార్పుల కారణంగా ఇవి సాధారణంగా మారిపోయాయని నిపుణులు పేర్కొంటున్నారు. 2024లో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కూడా కుదుపులకు గురైంది. ఈక్రమంలో ప్రయాణికుల్లో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దశాబ్దాల కాలంలో కుదుపులకు గురై మరణించిన మొదటి వ్యక్తి ఆయనే.




## నిద్రిస్తున్న భర్తపై వేడినీళ్లు పోసిన భార్య

**భీమునిపట్నం:** విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధి నేరెళ్లవలసలో దారుణం చోటుచేసుకుంది. నిద్రిస్తున్న భర్తపై భార్య వేడినీళ్లు పోసింది. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. నందిక కృష్ణ, గౌతమి ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి గౌతమి తన భర్తపై వేడినీళ్లు పోసింది. బాధితుడికి గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# భారత్-రష్యా బంధం


### 'ఐ డోంట్ కేర్' : ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**యూఎస్ :** భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయడమే అందుకు కారణమని కూడా తెలిపారు. తాజాగా రష్యా, భారత్‌లను ఉద్దేశిస్తూ ఆయన మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ట్రూత్ సోషల్‌లో ఆయన ఓ పోస్టు పెట్టారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తనకు సంబంధం లేదన్నారు. వారి ఆర్థికవ్యవస్థను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. న్యూదిల్లీతో చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నామన్నారు. ఎందుకంటే భారత్ అత్యధికంగా సుంకాలు విధిస్తుందని ఆరోపించారు. ఈసందర్భంగా రష్యా, యూఎస్‌లు కలిసి ఎలాంటి వ్యాపారం చేయట్లేదని ట్రంప్ స్పష్టంచేశారు. అనంతరం ఆ దేశ మాజీ అధ్యక్షుడు దిమిత్రి మద్వెదేవ్‌పై విరుచుకుపడ్డారు. తమతో వాషింగ్టన్ గేమ్ ఆడుతుందని, అది యుద్ధానికి దారితీయొచ్చని దిమిత్రి హెచ్చరించడంపై ట్రంప్ స్పందిస్తూ.. ఆయన ఇంకా అధ్యక్షుడిననే అనుకుంటున్నారని విమర్శించారు. ఆయన ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని హెచ్చరించారు. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారీగా సుంకాలు విధిస్తామని భారత్‌తో సహా పలు దేశాలను ఇటీవల పలుమార్లు అమెరికా హెచ్చరిస్తూ వచ్చింది. ఈక్రమంలో ఇదే కారణాన్ని చూపుతూ.. భారత దిగుమతులపై 25శాతం సుంకంతో పాటు, పెనాల్టీలు కూడా విధించారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూదిల్లీ ఒకటని ఆరోపించారు. ఆగస్టు 1 నుంచి ఈ నిర్ణయం అమలులోకి వస్తుందన్నారు. రష్యా నుంచి దిగుమతుల కారణంగా యూఎస్ పెనాల్టీలకు గురైన తొలి దేశం భారత్. ఈ సుంకాలపై భారత్ స్పందిస్తూ.. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

## ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో సాంకేతిక సమస్య

### నిలిచిపోయిన వందలాది విమానాలు



**యూకే :** యూకేలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో దేశంలోని పలు ప్రధాన విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 100కి పైగా విమానాలు రద్దయ్యాయి. ఈ సమస్య నేపథ్యంలో హీత్రో, గాట్విక్, మాంచెస్టర్, బర్మింగ్‌హామ్, కార్డిఫ్, ఎడిన్‌బర్గ్, లండన్ వంటి విమానాశ్రయాల్లో విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దాదాపు 20 నిమిషాల తర్వాత ఈ సమస్యను పరిష్కరించినట్లు నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ ఓ ప్రకటనలో తెలిపింది. 'మా వ్యవస్థలు తిరిగి పూర్తిగా పనిచేస్తున్నాయి. విమానాల రాకపోకలు సాధారణ స్థితికి వచ్చాయి. అన్ని విమానాశ్రయాలలో సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. సమస్య కారణంగా ప్రభావితమైన ఎయిర్‌పోర్టులతో కలిసి పనిచేస్తున్నాం. ఈసందర్భంగా ఇబ్బందులకు గురైన వారందరికి క్షమాపణలు తెలుపుతున్నాం' అని వెల్లడించింది. బ్రిటన్‌లోని అతిపెద్దదైన హీత్రో ఎయిర్‌పోర్టులో కూడా విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ఎన్ఏటీఎస్ స్వాన్విక్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్‌లో సాంకేతిక సమస్య కారణంగా తమ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలపై ప్రభావం చూపించిందని హీత్రో విమానాశ్రయ ప్రతినిధి తెలిపారు. సమస్య పరిష్కారం అయినప్పటికీ.. ఆలస్యాలు కొనసాగే అవకాశం ఉందని పలు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. 2023 ఆగస్టులో కూడా యూకేలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తింది. అప్పుడు కూడా దేశవ్యాప్తంగా పలు విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. భారీ సంఖ్యలో ప్రజలు యూకే విమానాశ్రయాల్లో పడిగాపులు కాశారు. కొన్ని గంటల తర్వాత ఎన్ఏటీఎస్ ఆ సమస్యను పరిష్కరించింది.

## వరదల్లో కొట్టుకుపోయిన రూ.12 కోట్ల బంగారం

### వెతికేందుకు ఎగబడిన జనం



**చైనా :** చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీలో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు. బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## మాలేగావ్ పేలుడు కేసు

### మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సహా ఏడుగురూ నిర్దోషులే



**ముంబయి:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుడు కేసులో ముంబయిలోని ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు నిందితులను ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని కోర్టు తెలిపింది. "ఈ కేసుకు ఉపా చట్టం వర్తించదు. ఈ పేలుడుకు వినియో గించిన మోటార్ బైక్.. మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిం దని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగి న సాక్ష్యాధారాలు లేవు. బైక్‌కు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకు కూడా ఆధారాల్లేవ్. ఉగ్రవాదా నికి మతం లేదు. ఎందుకంటే ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. కానీ, కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాల తో ఎవరినీ కోర్టులు శిక్షించవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు" అని తీర్పు వెలువరించే సమయంలో కోర్టు వెల్లడించింది. ఈ కేసులో ఆరుగురు మృతుల కుటుంబా లకు రూ.2లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని న్యాయ స్థానం ఆదేశించింది. క్షతగా త్రులకు రూ.50వేల ఆర్థికసాయం ఇవ్వాలని సూచించింది. తీర్పుపై మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ కేసు కారణంగా గత 17 ఏళ్ల పాటు తన జీవితం నాశనం అయ్యిందన్నారు. తనను బాధ పెట్టిన వారిని దేవుడే శిక్షిస్తారని అన్నారు. మరోవైపు, ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు వెల్లడించాయి.

#### ఏంటీ కేసు..?

మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసులో తొలుత దర్యాప్తు ప్రారంభించిన ఏటీ ఎస్.. ప్రస్తుత సాక్షి (40వ నంబరు) సహా పలువురి వాంగ్మూలాలను అప్పట్లో నమోదుచేసింది. ఆపై కేసు దర్యాప్తు బాధ్యత లను ఎన్ఐఏ స్వీకరించింది. ఈ కేసులో 220 మంది సాక్షుల ను విచారించగా.. వారిలో 15 మంది అంతకుముందు తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మాట్లాడటం గమనార్హం.




## రోహింగ్యాలు చొరబాటుదారులా?.. శరణార్థులా?: సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ :** రోహింగ్యాలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. అసలు వాళ్లు శరణార్థులా, చొరబాటుదారులా అనేదే పెద్ద సమస్య.. తొలుత దీనిపై క్లారిటీ వస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని పేర్కొంది. ఒకవేళ వాళ్లు చొరబాటుదారులైతే వారిని బహిష్కరిస్తున్నారా? అని ప్రశ్నించింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "శరణార్థులా లేదా చొరబాటుదారులా అనేదే ప్రధాన సమస్య. శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులు కాదా? అలా ఐతే, వారికి ఎలాంటి రక్షణలు, హక్కులు ఉంటాయి? ఇక రెండో అంశం.. శరణార్థులు కాకుంటే, అక్రమ వలసదారులైతే.. వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? చొరబాటుదారులను నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా? కోర్టులు ఎటువంటి షరతులు విధించవచ్చు? అని అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని, వారిని నిరవధికంగా అలా కొనసాగించలేరని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని తెలిపింది. ఇదే అంశంపై ఈ ఏడాది మే నెలలో విచారణ జరిపిన సుప్రీం కోర్టు .. దేశంలో ఉన్న రోహింగ్య శరణార్థులు విదేశీయులని తేలితే, భారత చట్టాల ప్రకారం వారిని తిరిగి పంపించాల్సిందేనని అభిప్రాయపడింది. యూఎన్‌హెచ్‌సీఆర్ జారీ చేసిన ఐడీ కార్డులు కూడా వారికి ఎటువంటి సాయం చేయకపోవచ్చంటూ అంతకుముందు ఇచ్చిన ఆదేశాలను గుర్తుచేసింది. ఇదిలాఉంటే, దేశంలో 12 రాష్ట్రాల్లో రోహింగ్యాలు నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. దిల్లీ, తెలంగాణ, యూపీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వీరు ఉంటున్నప్పటికీ.. కచ్చితంగా ఎంత మంది ఉన్నారనే దానిపై స్పష్టత లేదని కేంద్ర హోంశాఖ గతంలో ఓసారి వెల్లడించింది.

## ట్రంప్ ఒత్తిడికి భారత్ లొంగకూడదు


### కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్



**న్యూఢిల్లీ :** భారత దిగుమతులపై 25శాతం సుంకంతో పాటు అదనంగా జరిమానాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ప్రకటన సరికాదన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత వాణిజ్యానికి అమెరికా అతి పెద్ద మార్కెట్. మన ఎగుమతులే 87-90 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయి. రష్యా నుంచి దిగుమతులు చేస్తున్నందుకు సుంకాలు, జరిమానా విధిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య చర్చల్లో బేరసారాల కోసం ఇది హెచ్చరిక కావొచ్చు. టారీఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే అది మనకు నష్టం కలుగుతుంది. ఇది మన జీడీపీపై కూడా ప్రభావం చూపించొచ్చు. అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివిగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం. మన అవసరాలను కూడా అగ్రరాజ్యం అర్థం చేసుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ టారిఫ్‌ల విషయంలో మన దేశ విధానంపై నమ్మకం ఉందని థరూర్ పేర్కొన్నారు. తర్వాత ఏం జరుగుతుందనేది కొనసాగుతున్న చర్చలపై ఆధారపడి ఉంటుందన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగిపోకుండా.. న్యూదిల్లీ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందనే కారణం చూపుతూ.. భారత దిగుమతులపై ట్రంప్ 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధించారు. ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూదిల్లీ ఒకటని ఈ సందర్భంగా మళ్లీ ఆరోపించారు. ఈ క్రమంలోనే రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తమకు సంబంధం లేదని ఆయన మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారి ఆర్థికవ్యవస్థను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు.

## ట్రంప్ సుంకాల మోత..

### పార్లమెంటులో పీయూష్ గోయల్ ప్రకటన



**న్యూఢిల్లీ :** భారత్ నుంచి వచ్చే అన్ని రకాల వస్తువులపై 25 శాతం పన్నులతోపాటు అదనంగా పెనాల్టీలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంటు ఉభయ సభల్లో ప్రకటన చేశారు. సుంకాల ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పదేళ్లలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా భారత్ పయనిస్తోందన్న అంశాన్ని గుర్తుచేశారు. "ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలపై కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. భారత్ ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వచ్చేలా షెడ్యూల్ చేశారు. అనంతరం దాన్ని 90 రోజులపాటు తాత్కాలికంగా వాయిదా వేశారు. అప్పటివరకు 10 శాతం సుంకాలు విధించారు. ఆపై ఆగస్టు 1 వరకు పొడిగించారు. ఇరుదేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం' కోసం మార్చిలో చర్చలు ప్రారంభమయ్యాయి. అక్టోబర్- నవంబర్ నాటికి ఒప్పందం మొదటి దశను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం" అని పీయూష్ గోయల్ తెలిపారు.

# అది ఫైనల్ అయినా సరే..
# బహిష్కరించేవాళ్లమే

## ఇండియా ఛాంపియన్స్



పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడకూడదని టీమ్ఇండియా మాజీలు గట్టిగా చెప్పారు. అయితే, వరల్డ్ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్ టోర్నీలో పాక్‌తో రెండు మ్యాచుల్లో తలపడే పరిస్థితి ఎదురైంది. ఒకటి లీగ్ స్టేజ్‌లో కాగా.. రెండోది సెమీస్. ఇండియా ఛాంపియన్స్ మాత్రం నిస్సంకోచంగా పాక్‌తో మ్యాచ్‌లను రద్దు చేసుకుంది. భారత్ సెమీస్‌ను బహిష్కరించడంతో పాక్ ఫైనల్‌కు చేరుకుంది. ఈక్రమంలో తాము ఒకవేళ టైటిల్ పోరుకు అర్హత సాధించి అక్కడా పాక్ ప్రత్యర్థిగా వచ్చినా ఇదే నిర్ణయం తీసుకొనేవాళ్లమని ఇండియా ఛాంపియన్స్ ప్లేయర్లు పేర్కొన్నా రు. "మేం పాకిస్థాన్‌తో ఆడటం లేదు. మాకు ఎప్పుడైనా సరే దేశం ముఖ్యం. నేషన్ కోసం ఇలాంటి నిర్ణయా లు తీసుకొనేందుకు సంకోచించం. భారత జట్టు సభ్యులుగా మేం ఎప్పుడూ గర్వపడుతూనే ఉంటాం. ఎలాంటి పరిస్థితుల్లోనూ మా దేశాన్ని ఎప్పటికీ నిరాశపరచం. మేం సెమీస్‌కు చేరుకున్న తర్వాత మ్యాచ్‌ను రద్దు చేసుకున్నాం. ఒకవేళ ఫైనల్‌కు చేరి అక్కడా పాక్ ప్రత్యర్థిగా ఎదురైనా సరే ఇదే నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. మేమంతా ఒకే మాటపై నిలబడతాం" అని ఇండియా ఛాంపియన్స్ ఆటగాడొకరు తెలిపారు.

### ఇప్పుడు ఇక ఆసియా కప్‌పై..

మాజీ క్రికెటర్లే పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను రద్దు చేసుకోవడంతో.. ఇప్పుడు అందరి దృష్టి ఆసియా కప్‌పై పడింది. యూఏఈ వేదికగా ఆసియా కప్ జరగనుందని ఇప్పటికే ఏసీసీ వెల్లడించిన సంగతి తెలిసిందే. టీమ్ఇండియా ఎలా అంగీకరించిందని విమర్శలూ వచ్చాయి. ఇప్పుడు డబ్ల్యూసీఎల్‌లో మ్యాచ్‌లను రద్దు చేసుకోవడంతో.. ఆసియా కప్‌లోనూ భారత్ పాల్గొనవద్దనే డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తున్న పాకిస్థాన్‌తో ఎలాంటి క్రీడా సంబంధాలు పెట్టుకోవద్దని సూచనలు చేశారు. మరి బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఎందుకంటే కేంద్ర మంత్రి ఒకసారి తాము ఐసీసీ టోర్నీలకు ఎలాంటి అభ్యంతరం చెప్పమని అన్నారు. అయితే, భారత అభిమానులు మాత్రం అసలు పాక్‌తో ఆడొద్దని కోరుతున్నారు. ఒకవేళ ఆసియా కప్ రద్దు అయితే ఆ ప్రభావం వచ్చే ఏడాది పొట్టి కప్ పైనా పడే ప్రమాదం లేకపోలేదు. అప్పుడు ఆర్థికంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మరిన్ని కష్టాలను ఎదుర్కోవాల్సిందే.

# తడబడి.. నిలబడ్డ భారత్

## ఆదుకున్న కరుణ్
## ఇంగ్లాండ్‌తో ఆఖరి టెస్టు



**లండన్:** సిరీస్‌లో చివరిదైన అయిదో టెస్టులో టీమ్ఇండియా గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. వర్ష ప్రభావిత తొలి రోజు చాలా ఇబ్బందిపడింది. గురువారం ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (52 బ్యాటింగ్, 98 బంతుల్లో 7(4)) విలువైన అర్ధశతకంతో జట్టును ఆదుకున్నాడు. అతడికి తోడుగా వాషింగ్టన్ సుందర్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కరుణ్, సుందర్ జంట అభేద్యమైన ఏడో వికెట్‌కు 51 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. సాయి సుదర్శన్ (38, 108 బంతుల్లో 6(4)) బాగానే ఆరంభించినా.. పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. అట్కిన్సన్, టంగ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

ఓవల్‌లో గురువారం భారత బ్యాటర్లను ఇంగ్లాండ్ పేసర్లు పరీక్షించారు. కరుణ్ నాయర్ నిలవకపోతే తొలి రోజు టీమ్ఇండియా పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉండేదే. సిరీస్‌లోనే అత్యంత పచ్చిక పిచ్‌పై టాస్ గెలిచి ఇంగ్లాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. టీమ్ఇండియా పేలవంగా ఆరంభించింది. 38 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. పిచ్‌కు సీమ్‌కు అనుకూలించింది. నాలుగో ఓవర్లోనే భారత్‌కు షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండు పరుగులకే వెనుదిరిగాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న అట్కిన్సన్.. తన రెండో ఓవర్లోనే భారత్‌ను దెబ్బతీశాడు. జైస్వాల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. మైదానం అంపైర్ ఔట్ ఇవ్వకపోయినా.. ఇంగ్లాండ్ సమీక్షలో సాధించుకుంది. అయితే జోష్ టంగ్, ఒవర్టన్ ఆరంభంలో నియంత్రణతో బౌలింగ్ చేయలేకపోయారు. టంగ్ తన తొలి ఓవర్లో రెండు వైడ్ల ద్వారా పది పరుగులు సహా మొత్తం 12 పరుగులిచ్చాడు. భారత్ 38/1తో కాస్త కుదురుకుంటున్నట్లే కనిపించింది. కానీ అంతలోనే రాహుల్ (40 బంతుల్లో 14) ఔటయ్యాడు. ఈ సిరీస్ ఆరంభం నుంచి నిలకడగా రాణిస్తోన్న అతడు.. రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. క్రిస్ వోక్స్ షార్ట్ బాల్‌ను కట్ చేయబోయిన రాహుల్.. స్టంప్స్ మీదికి ఆడుకున్నాడు. మరోవైపు పట్టుదలగా ఆడుతున్న సాయి సుదర్శన్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (21బీ 35 బంతుల్లో 4ఐ4) తోడయ్యాడు. వీళ్లిద్దరూ చక్కగా బ్యాటింగ్ చేశారు. లంచ్ వరకు మరో వికెట్ పడనివ్వలేదు. టంగ్, వోక్స్ బౌలింగ్‌లో సాయి బౌండరీలు బాదాడు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన గిల్.. ఒవర్టన్ బౌలింగ్‌లో కవర్స్ మీదుగా బంతిని బౌండరీ దాటించాడు. అతడి తర్వాతి ఓవర్లోనూ కవర్స్‌లో అలవోకగా మరో బౌండరీ కొట్టాడు. ఈ బ్యాటర్లు నిలదొక్కుకోవడంతో 72/2తో టీమ్ఇండియా లంచ్‌కు కాస్త సంతృప్తిగానే వెళ్లింది. కానీ ఆ సంతృప్తి ఎంతో సేపు నిలవలేదు. లంచ్ తర్వాత ఇన్నింగ్స్ సాఫీగా సాగుతుండగా గిల్ అనవసరంగా, లేని పరుగు కోసం ప్రయత్నించి రనౌటై జట్టును ఇబ్బందుల్లోకి నెట్టాడు. అట్కిన్సన్ బంతిని ఆఫ్‌సైడ్ నెట్టిన గిల్ పరుగందుకున్నాడు. కానీ బంతి బౌలర్‌కు దగ్గరగానే వెళ్లింది. పిచ్ మధ్య వరకు వెళ్లాక అది గుర్తించిన గిల్ వెనుదిరిగాడు. కానీ అప్పటికే ఆలస్యమైంది. ఫాలోత్రూలో బంతిని అందుకున్న అట్కిన్సన్.. స్టంప్స్‌ను కొట్టాడు. దీంతో 45 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇన్నింగ్స్‌లో ఇదే మలుపు అనుకోవచ్చు. కరుణ్ నాయర్‌తో కలిసి సుదర్శన్ జట్టు స్కోరును వంద దాటించాడు. కానీ పెద్ద ఇన్నింగ్స్ ఆడేలా కనిపించిన అతడు.. కీలక సమయంలో టంగ్ బౌలింగ్‌లో నిష్క్రమించాడు. ఆడడానికి చాలా కష్టమైన ఔట్ స్వింగర్‌కు అతడు ఔట్ సైడ్ ఎడ్జ్‌తో వికెట్‌కీపర్ స్మిత్‌కు చిక్కాడు. గత మ్యాచ్ హీరో జడేజా (9) ఎక్కువసేపు నిలవలేదు. టంగ్ బౌలింగ్‌లోనే అతడు కూడా వెనుదిరగడంతో 123/5తో భారత్ కష్టాల్లో పడింది. కానీ కరుణ్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. చక్కగా బ్యాటింగ్ చేసిన అతడు.. ముందు జురెల్ (19), తర్వాత సుందర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఆత్మవిశ్వాసంతో ఆడిన కరుణ్.. చక్కని బౌండరీలతో అలరించాడు.



# స్విగ్గీ నష్టం డబుల్..
## సగానికి పైగా క్విక్ కామర్స్ నుంచే


**ఢిల్లీ:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.1197 కోట్ల నికర నష్టాన్ని నమోదుచేసింది. గతేడాది ఇదే సమయంలో కంపెనీ రూ.611 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. అంటే ఏడాదిలో నష్టాలు దాదాపు రెట్టింపయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో స్విగ్గీ మొత్తం ఆదాయం కూడా రూ.3,310 కోట్ల నుంచి రూ.5,048 కోట్లకు పెరిగింది. డెలివరీ ఖర్చులు, అడ్వైర్టైజ్‌మెంట్ ఖర్చులు, ఎంప్లాయీ బెనిఫిట్స్, క్విక్‌కామర్స్‌కు సంబంధించి లాజిస్టిక్స్ ఖర్చులు వంటి మొత్తం ఖర్చులు కూడా రూ.3908 కోట్ల నుంచి రూ.6244 కోట్లకు పెరిగాయి. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో స్విగ్గీ షేరు 0.62 శాతం లాభంతో రూ.403 వద్ద ముగిసింది. విభాగాల వారీగా చూస్తే ఫుడ్‌డెలివరీ సెగ్మెంట్ ఆదాయం రూ.1799 కోట్లు కాగా.. రూ.202 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్విక్‌కామర్స్ విభాగమైన స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ఆదాయం రూ.806 కోట్లు కాగా.. రూ.797 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. సప్లయ్ చైన్, డిస్ట్రిబ్యూషన్ ఆదాయం రూ.2,259 కోట్లు కాగా.. ఈ విభాగంలో రూ.47 కోట్ల నష్టం వచ్చినట్లు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. దీర్ఘకాలిక సుస్థిర లాభాల దృష్ట్యా ఇతర విభాగాలపై పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం భారీ నష్టాలకు కారణమని స్విగ్గీ సీఈఓ శ్రీహర్ష మాజేటి తెలిపారు. దాదాపు ఇదే బిజినెస్ మోడల్‌తో నడుస్తున్న జొమాటో మాతృ సంస్థ ఎటెర్నల్.. ఇదే త్రైమాసికంలో రూ.25 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయడం గమనార్హం. ఆ కంపెనీ ఆదాయం రూ.7,167 కోట్లుగా నమోదైంది.




# ట్రంప్ టారిఫ్ షాక్
## భారీ నష్టాల నుంచి మోస్తరు నష్టాల్లోకి

**ముంబయి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల ప్రకటనతో దేశీయస్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆగస్టు 1 నుంచి భారత్‌పై 25 శాతం టారిఫ్‌తో పాటు రష్యా నుంచి చమురు కొనుగోలు చేపడుతున్నందున పెనాల్టీలు కూడా విధిస్తామని ప్రకటించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఆరంభంలో భారీ నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరికి మోస్తరు నష్టాలతో గట్టెక్కాయి. అయితే, ఇంట్రాడే కనిష్ఠాల నుంచి దాదాపు 1100 పాయింట్ల మేర సెన్సెక్స్ కోలుకోవడం గమనార్హం. హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎటెర్నల్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ట్రంప్ టారిఫ్‌ల ప్రకటనతో ఉదయం సెన్సెక్స్ 80,695.50 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,481.86) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటి తర్వాత కోలుకుని ఓ దశలో లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 81,803.27 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 296.28 పాయింట్ల నష్టంతో 81,185.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86.70 పాయింట్ల నష్టంతో 24,786.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.58గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటెర్నల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.66 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,358 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# రూ.8,700 కోట్లు ఇస్తామన్న మెటా
## అయినా ఆమెను ఒక్క ఉద్యోగి కూడా విడిచిపెట్టలేదు



ఇప్పుడిది కృత్రిమ మేధ యుగం. ఏఐ టాలెంట్ ఎక్కడ ఉన్నా లాగేసేందుకు టెక్ దిగ్గజాలు భారీ ఆఫర్లతో ఊరిస్తున్నాయి. కానీ ఓ ఏఐ స్టార్టప్ ఉద్యోగులు మాత్రం ఆ వలలో చిక్కలేదు. తమ సంస్థను నడిపిస్తోన్న మీరా మురాటీని ఒక్కరు కూడా విడిచివెళ్లలేదు. 2025 ఫిబ్రవరిలో థింకింగ్ మెషిన్స్ ల్యాబ్‌ను మీరా మురాటీ ఏర్పాటుచేశారు. మెటా, మిస్ట్రాల్, ఓపెన్‌ఏఐ వంటి కంపెనీల్లో పనిచేసిన 30 మంది పేరు పొందిన ఏఐ నిపుణులను ఆమె నియమించుకుంది. ఈ సంస్థలోని నైపుణ్యం మెటా (ఫేస్‌బుక్) దృష్టిని ఆకర్షించింది. దాంతో అక్కడ పనిచేసే ఏఐ నిపుణులను తనవైపు లాగేసుకునేందుకు మెటా ప్రయత్నించిందని, 10 మందికి పైగా ఉద్యోగులకు భారీ ఆఫర్లు ఇచ్చిందని ఓ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఈ ఏఐ నిపుణులకు 200 మిలియన్ల డాలర్ల నుంచి 500 మిలియన్ల డాలర్ల వరకు మెటా ఆఫర్ చేసింది. ఓ ఉద్యోగికైతే ఏకంగా 1 బిలియన్ డాలర్లు (రూ.8,755 కోట్లు) ఇచ్చేందుకు కూడా సిద్ధమైంది. కొంతమందితో మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ నేరుగా సంప్రదింపులు జరిపారట కూడా. ఆ థింకింగ్ మెషిన్స్ ల్యాబ్‌ను పెట్టి సంవత్సరం కూడా కాలేదు. దానినుంచి ఏ ఒక్క ఉత్పత్తి కూడా ఇంతవరకు మార్కెట్‌లోకి విడుదలవలేదు. కానీ ఆ సిబ్బంది మాత్రం మురాటీపై విశ్వాసం ప్రదర్శించారని ఆ కథనం వెల్లడించింది. ఇప్పుడు ఆ సంస్థ మార్కెట్ విలువ 12 బిలియన్ డాలర్లుగా ఉంది.

### ఎవరీ మురాటీ..?

మీరా మురాటీ అల్బేనియాలోని వ్లోర్ అనే పట్టణంలో జన్మించారు. స్కూలింగ్ అంతా అక్కడే పూర్తిచేసిన ఆమె.. పైచదువుల కోసం తన 16వ ఏట కెనడాలోని వాంకోవర్ ఐస్‌ల్యాండ్‌కు వెళ్లిపోయారు. ఆ దేశంలోనే పైచదువులు పూర్తి చేశారు. చదువు పూర్తయ్యాక 2011లో 'గోల్డ్‌మన్ శాక్స్'లో ఇంటర్న్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత 'టెస్లా'లో మూడేళ్ల పాటు పనిచేసిన ఆమె.. ఈ వ్యవధిలో ఈ సంస్థ అభివృద్ధి చేసిన 'మోడల్ ఎక్స్' ఈ–కారు మోడల్‌కు సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్‌గా సేవలందించారు. ఇక 'లీప్ మోషన్' అనే వర్చువల్ రియాల్టీ సంస్థలో రెండేళ్ల పాటు విధులు నిర్వర్తించిన మీరా.. నిజ జీవితంలోని పలు సంఘటనలకు కృత్రిమ మేధను జోడిస్తూ కొన్ని ప్రయోగాలు చేశారు. ఈక్రమంలో తాను గడించిన నైపుణ్యాలే కృత్రిమ మేధపై మరింత ఆసక్తి పెరిగేలా చేశాయని ఓ సందర్భంలో వెల్లడించారు. ఈ మక్కువతోనే 2018లో 'ఓపెన్ ఏఐ' అనే అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థలో చేరారు. అంచలంచెలుగా ఎదుగుతూ ఉపాధ్యక్షురాలిగా, 'చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీవో)'గా బాధ్యతలందుకున్నారు. ఒక దశలో 'ఓపెన్ ఏఐ'కి తాత్కాలిక సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇక, 2024 చివర్లో ఆ కంపెనీకి గుడ్‌బై చెప్పి, సొంతంగా థింకింగ్ మెషిన్స్ ల్యాబ్ ఏర్పాటుచేశారు.

# యూపీఐ లావాదేవీలు..
## పేటీఎం, గూగుల్‌పేకు ఐసీఐసీఐ షాక్




యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గల్లీ దుకాణాల దగ్గర్నుంచి మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు సిద్ధమైంది ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఐసీఐసీ ఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్‌పై ప్రతి లావాదే వీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలుచేయనున్నట్లు సమాచారం. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్ పేమెంట్లు నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు భరిస్తోంది. ఈ క్రమంలోనే ఖర్చుల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు. "ఇది ఎప్పటికీ ఉచితంగా ఉండకూడదు. దీనిపై ఛార్జీలు అవసరం. ఎవరో ఒకరు వాటిని భరించాలి" అని అన్నారు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.



# ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో ఫ్రీ.. ఫ్రీ..
## వెనుక లాజిక్ ఇదీ

ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్.. విమానాల్లో ప్రయాణించే వారికి ఇది సుపరిచితమే. విమానం కోసం వేచి చూసే సమయంలో ఎయిర్‌పోర్టుల్లో ఉండే లాంజ్‌ల్లో ఎంచక్కా సేద తీరొచ్చు. మీ దగ్గర క్రెడిట్ కార్డు ఉంటే దాదాపు ఫ్రీగానే వైఫై, ఫుడ్, కూల్ డ్రింక్స్ వంటివి ఆస్వాదించొచ్చు. సాధారణంగా ఎయిర్‌పోర్ట్‌లో ఏదైనా కొనాలంటే తడిసి మోపెడవుతుంది. అలాంటి చోట ఎలాంటి ఖర్చూ లేకుండా ఈ సౌకర్యాలు ఎలా సాధ్యం? దీనికి ఎవరు చెల్లిస్తారు? ఏమిటీ బిజినెస్ మోడల్? ఎప్పుడైనా మీకూ ఈ డౌట్ వచ్చిందా? ఇదే అంశంపై సూరజ్ కుమార్ తల్రేజా అనే వ్యక్తి ఎక్స్‌లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. గతంలో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులో డేటా అనలిస్టుగా పనిచేసిన ఆయన లాంజ్ వెనుక లాజిక్‌ను వివరించారు.

### ఎవరు చెల్లిస్తారు?

భారత్‌లో ఉన్న చాలా ఎయిర్‌పోర్టుల్లో లాంజ్ యాక్సెస్ సదుపాయం ఉంది. వీటిల్లో కేవలం మన కార్డు స్వైప్ చేస్తే సరిపోతుంది. ఎంచక్కా బఫే ఫుడ్, బేవరేజెస్, వైఫై, ఛార్జింగ్ పాయింట్స్, న్యూస్ పేపర్స్, రిక్లెయినర్లు, కొన్నిచోట్ల స్లీపింగ్ పాడ్స్, స్పా వంటి సదుపాయాలను వినియోగించుకోవచ్చని తల్రేజా పేర్కొన్నారు. మీ తరఫున కార్డు జారీ చేసిన సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ వంటి బ్యాంకులు లేదా వీసా, మాస్టర్ కార్డ్ వంటి కార్డు నెట్‌వర్కులు చెల్లిస్తాయి. ఈ మొత్తం క్రెడిట్ కార్డు బెన్‌ఫిట్స్‌లో భాగమే.

### ఒక్కో లాంజ్‌కు ఎంతవుతుంది?

డొమెస్టిక్ లాంజ్‌ల్లో ఒక వ్యక్తి వినియోగిస్తే సగటున ఒక్కో విజిట్‌కు రూ.600 నుంచి రూ.1200 చొప్పున ఆయా సంస్థలు మనపైన ఖర్చు చేస్తాయి. అదే ఇంటర్నేషనల్ లాంజ్‌ల్లో అయితే ఈ మొత్తం 25 నుంచి 35 డాలర్ల వరకు ఉంటుంది. మీరు 30 నిమిషాలు లాంజ్‌లో కూర్చుని టీ/కాఫీ తాగి శాండ్ విచ్ తిన్నందుకు ఆ బిల్లును బ్యాంక్ చెల్లిస్తుందన్నమాట.

### బ్యాంకులకేమిటి ప్రయోజనం?

- క్రెడిట్ కార్డు/ డెబిట్ కార్డు వినియోగదారులకు ఫ్రీ లాంజ్ యాక్సెస్ ఇవ్వడంలోనే బిజినెస్ మోడల్ దాగుందంటారు తల్రేజా. మార్కెటింగ్‌కు, కస్టమర్ల రిటెన్షన్‌కు ఇది చక్కగా ఉపయోగపడుతుందంటారు.
- ప్రీమియం సదుపాయాన్ని ఫ్రీగా అందించడం ద్వారా ఆ కార్డును యూజర్లు ఎక్కువగా వినియోగిస్తారు. మూడు నెలలకు ఇంత ఖర్చు చేస్తేనే లాంజ్ సదుపాయం ఉంటుందని బ్యాంకులు చెప్పడం ఇందులో భాగమే. అంటే ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే ఆ మేర బ్యాంకుకు మర్చంట్ ఫీజు అందుతుంది.
- ఫ్రీ లాంజ్ వల్ల ఆ కార్డుకు మీరు లాయల్ యూజర్‌గా ఉంటారు. మీరు తరచూ ప్రయాణించే వారైతే ప్రీమియం కార్డుకు అప్‌గ్రేడ్ అయ్యేలా చేస్తారు. ఇక్కడ సైకాలజీం ఎకనమిక్స్ వర్కౌట్ అవుతుంది. ప్రీమియం కార్డుకు అప్‌గ్రేడైతే తద్వారా వార్షిక రుసుము బ్యాంకుకు అందుతుంది.
- వాస్తవంలో మనకు లభించే ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ క్రెడిట్ కార్డు ప్రయోజనాల్లో భాగమే తప్ప.. అది ఉచితంగా లభించడం లేదంటారు తల్రేజా. మీరు వార్షిక రుసుము చెల్లించడం ద్వారానో, అధికంగా ఖర్చు చేయడం ద్వారానో లాంజ్ సదుపాయాల వినియోగానికి ముందుగానే బ్యాంకుకు చెల్లిస్తున్నామని వివరించారు. ఆయన పెట్టిన పోస్ట్‌కు సుమారు 12 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి.

# కింగ్డమ్

## తన జాతి కోసం నిలబడిన ఓ నాయకుడి కథ

**విజయ్ దేవరకొండ సినిమా వస్తుందంటే యువతలో అమితాసక్తి నెలకొంటుంది. వరుస సినిమాలు చేస్తున్నా, బాక్సాఫీస్ వద్ద మేజిక్ క్రియేట్ చేయడంలో తడబడుతున్నారు. ఈ నేపథ్యంలో గౌతమ్ తిన్ననూరితో కలిసి ఆయన చేసిన తాజా చిత్రం 'కింగ్డమ్' సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణం ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచింది. మరి.. విజయ్ కెరీర్‌కి ఎంతో కీలకమైన ఈ సినిమా ఎలా ఉంది? యాక్షన్ థ్రిల్లర్ మెప్పించిందా?**

రివ్యూ




సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమైన తన అన్న శివ (సత్యదేవ్) జాడ కోసం వెతుకుతుంటాడు. ఆ ప్రయత్నంలో ఉండగానే పోలీస్ అధికారులకీ సూరికి మధ్య గొడవ జరుగుతుంది. అది తన పై అధికారుల వరకూ వెళ్తుంది. అందుకు సంబంధించి విచారణ జరుగుతున్నప్పుడు ఊహించని రీతిలో సూరికి ఓ మిషన్ బాధ్యతల్ని అప్పజెబుతారు. సూరి వెతుకుతున్న తన అన్న శివ ఆచూకీ శ్రీలంక సమీపంలోని దివి అనే ఓ ద్వీపంలో ఉందని, గూఢచారిగా అక్కడ పనిచేయాలని చెబుతారు. తన అన్న కోసం ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధమైన సూరి... పై అధికారి చెప్పినట్టే శ్రీలంకలో అడుగు పెడతాడు. అత్యంత ప్రమాదకరమైన స్మగ్లింగ్ కార్టెల్ అదుపాజ్ఞల్లో ఉన్న దివిలోకి సూరి ఎలా అడుగు పెట్టాడు?ఇంతకీ శివ ఆ దివికి ఎందుకు వెళ్లాడు? ఆ ద్వీపంలో ఉన్న తెగకీ, శివకీ సంబంధం ఏమిటి? అక్కడి తెగ 70ఏళ్లుగా ఎవరి రాకకోసం ఎదురు చూస్తూ ఉంటుంది? తన అన్నతో కలిసి సూరి తిరిగొచ్చాడా?అన్నది చిత్ర కథ.

### ఎలా ఉందంటే..

అన్నదమ్ముల చుట్టూ తిరిగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇది. తెలుగులో ఇలాంటి కథలు కొత్తేమీ కాదు కానీ, మిగతావాటితో పోలిస్తే దీనిలో అన్నదమ్ముల బంధం, ద్వీపంలో చిక్కుకుపోయిన ఓ తెగ నేపథ్యమే 'కింగ్డమ్'ను భిన్నంగా నిలుపుతుంది. గ్యాంగ్‌స్టర్ కథలకి డ్రామా కీలకం. ఆ విషయంలో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి రచన బలమైన ప్రభావమే చూపిస్తుంది. డ్రామాతోపాటు కథా ప్రపంచంలో లీనం చేసే విజువల్స్, వాటికి మరింత బలాన్నిచ్చే సంగీతం, తెరపైన పాత్రలు తప్ప నటులే కనిపించని అభినయాలు... ఇలా అన్నీ ఉన్నా ఆ స్థాయిలో భావోద్వేగాలు బలంగా పండించలేకపోయారు. 1920ల నాటి నేపథ్యాన్ని తెరపై ఆవిష్కరిస్తూ కథని ఆసక్తికరంగా మొదలు పెట్టాడు దర్శకుడు. తొలి సన్నివేశంతోనే 'కింగ్డమ్' ప్రపంచంలో లీనమయ్యేలా చేశారు. ఆ తర్వాత కానిస్టేబుల్‌గా సూరి జీవితం, అన్న జాడ కోసం అతను చేసే ప్రయత్నాలు, ఆ తర్వాత మిషన్ బాధ్యతల్ని భుజాన వేసుకునే సన్నివేశాలతో సినిమా వేగంగానే పరుగులు పెడుతుంది. కథ శ్రీలంకకి మారాక జాఫ్నా జైలు నేపథ్యంతో పాటు, సూరి, శివ... తాము అన్నదమ్ములమనే విషయం ఇద్దరికీ ఎప్పుడు తెలుస్తుందనే అంశాలు ప్రేక్షకుల్లో ఆత్రుతని, ఆసక్తిని రేకెత్తిస్తాయి. దర్శకుడు ఆ విషయాలపైనే దృష్టిపెడుతూ, అసలైన భావోద్వేగాల్ని ఆవిష్కరించే అవకాశం ఉన్నా, ఆ దిశగా ప్రయత్నం చేసినట్టు లేరు. అడుగడుగునా నాటకీయతతో సన్నివేశాల్ని మలిచినా, కథకు ప్రధానంగా అవసరమైన భావోద్వేగాల్ని ఆవిష్కరించలేకపోయారు. ద్వితీయార్ధంలోనూ అదే కథే. మరికొన్ని ఉపకథలు తోడవుతూ కథ ముందుకు సాగుతూ ఉంటుంది. కథ నుంచి పక్కకు వెళ్లకుండా సన్నివేశాల్ని తీర్చిదిద్దడం సినిమాకు కలిసొచ్చింది. పతాక సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. 'కింగ్డమ్' ప్రపంచాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు, సాంకేతిక బృందం పడిన శ్రమతో తెరపై స్పష్టంగా కనిపిస్తుంది. రెండో భాగానికి అవకాశం ఉండేలా కథని ముగించారు.



## మనమే కొట్టినాం

### రష్మిక ట్వీట్

విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్' విడుదలై, అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అభిమానులూ, ఇండస్ట్రీ వాళ్లు సోషల్ మీడియాలో హర్షధ్వానాలు చేస్తున్న వేళ, ఓ ఎమోషనల్ ట్వీట్ అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా నేషనల్ క్రాష్ రష్మిక మందన్న 'నీకూ, నిన్ను ప్రేమించే ప్రతి ఒక్కరికి ఇది ఎంత ముఖ్యమో నాకు తెలుసు విజయ్.. మనమే కొట్టినాం కింగ్‌డమ్. అని ట్వీట్ చేసింది. ఈ మాటల వెనుక ఉన్న భావం సూటిగా హృదయాలను తాకుతుంది. విజయ్ దేవరకొండ ఎంతగా కష్టపడ్డాడో, ఈ సినిమా మీద ఆయనకు ఎంత నమ్మకంతో ఉన్నారో - అన్ని ఈ ట్వీట్‌లో స్పష్టంగా కనపడుతున్నాయి. ముఖ్యంగా 'మనమే కొట్టినాం' అన్న మాటలో గర్వం, భావోద్వేగం రెండూ సమపాళ్లలో ఉన్నాయి. తాజాగా ఈ ట్వీట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంది. ఇక కింగ్‌డమ్ చిత్రం ప్రస్తుతానికి పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. విజయ్ కొత్తగా ఎంచుకున్న కథ, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం, టెక్నికల్ టీమ్ చూసినవాళ్లంతా సినిమా బ్లాక్ బస్టర్ అని చెబుతున్నారు. ఈ తరహా మద్దతు, ప్రేమ విజయ్ దేవరకొండకు మరో స్థాయిలో నిలిచేలా చేస్తోంది.

### ఎవరెలా చేశారంటే..

విజయ్ దేవరకొండలో ఎంత మంచి నటుడు ఉన్నాడో మరోసారి రుజువు చేసే చిత్రమిది. సూరి పాత్రలో ఒదిగిపోయాడు. తెరపైన ఎక్కడా విజయ్ కనిపించలేదు. ఆరంభ సన్నివేశాలతో కలుపుకొంటే, తెరపైన మూడు కోణాల్లో కనిపిస్తారు. ప్రతి కోణంపైనా తనదైన ముద్రవేశారు. ముఖ్యంగా స్పై పాత్ర కోసం ఆయన మారిపోయిన విధానం, శ్రీలంక నేపథ్యంలో సాగే ఆ సన్నివేశాలపై బలమైన ప్రభావం చూపించారు. ఆయన చేసిన యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. శివ పాత్రలో సత్యదేవ్ నటన మరో ప్రధాన ఆకర్షణ. ఈ ఇద్దరి తర్వాత సినిమాలో కనిపించే మరో కీలకమైన పాత్ర... మురుగన్. ఆ పాత్రలో మలయాళ నటుడు వెంకటేశ్ చాలా బాగా నటించారు. స్మగ్లింగ్ కార్టెల్‌ని నడిపే యువ నాయకుడిగా కనిపిస్తాడు. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. సాంకేతికంగా.. సినిమా ఉన్నతంగా ఉంది. విజువల్స్ పరంగా ప్రతి ఫ్రేమ్ ఆకట్టుకుంటుంది. అనిరుధ్ నేపథ్య సంగీతం సినిమాకి ప్రధానబలం. ప్రొడక్షన్ డిజైన్, స్టైలింగ్ కథా ప్రపంచాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేశాయి. ఈ కథని నిర్మాతలు ఎంత బలంగా నమ్మారో ఈ సినిమా నిర్మాణమే చెబుతుంది. సినిమా టేకింగ్, మేకింగ్ విషయంలో దర్శకుడి ప్రతిభ అడుగడుగునా కనిపిస్తుంది.

## రూ.5 కోట్లు మోసం..

### కోలీవుడ్ నటుడు అరెస్ట్



కోలీవుడ్ నటుడు ఎస్.శ్రీనివాసన్‌ను దిల్లీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. రూ.1000 కోట్లు రుణం ఇప్పిస్తానంటూ ఓ సంస్థ నుంచి ఆయన రూ.5 కోట్లు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నటుడు శ్రీనివాసన్ తనకు తాను పవర్‌స్టార్ అని ప్రకటించుకున్నారు. దీంతో ఆయనను కోలీవుడ్‌లో కొందరు అభిమానులు ఇదే పేరుతో పిలుస్తుంటారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో శ్రీనివాసన్ ఓ సంస్థకు రూ.1000 కోట్లు రుణం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. దానికోసం వారి వద్ద నుంచి ముందుగా రూ.5 కోట్లు తీసుకున్నారు. రుణం రాకపోతే ఈ మొత్తాన్ని 30 రోజుల్లో తిరిగి ఇస్తానని చెప్పారు. ఈ డబ్బును సినిమా నిర్మాణం కోసం వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించుకున్నారు. రుణం రాకపోవడంతో ఆ సంస్థ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో దిల్లీ పోలీసులు చెన్నైలో శ్రీనివాసన్‌ను అరెస్ట్ చేశారు. 2010లో ఇండస్ట్రీలోకి వచ్చిన శ్రీనివాసన్ పలు తమిళ చిత్రాల్లో నటించారు. 2011లో 'లథిక' అనే సినిమాలో హీరోగా నటించారు. ఇది ఆదరణ సొంతం చేసుకోవడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. ఇప్పటివరకు 60కు పైగా సినిమాల్లో నటించారు. నటుడుగా అలరిస్తూనే పలు సినిమాల్లో కమెడియన్‌గా కనిపించారు. మరికొన్నింటికి నిర్మాతగానూ వ్యవహరించారు. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే చెన్నైలో ఓ ఫైనాన్స్ సంస్థను స్థాపించారు. ఆ సంస్థ పేరుతోనే ఈ మోసానికి పాల్పడ్డారు.



## వార్-2 నుంచి ఊపిరి ఊయలగా సాంగ్ విడుదల

బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో.. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన, భారీ పాన్ ఇండియా యాక్షన్ చిత్రమే 'వార్ 2'. ఒక క్రేజీ మల్టీస్టారర్‌గా వస్తున్న ఈ మూవి కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఫైనల్ గా మ్యూజికల్ ట్రీ-ట్ వచ్చేసింది. వార్ 2 నుంచి 'ఊపిరి ఊయలగా' అనే లవ్ సాంగ్ విడుదలైంది. ప్రస్తుతం ఈ సాంగ్ అభిమానుల్లో, యూత్‌లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. హృతిక్ రోషన్ - కియారా అద్వానీ కెమిస్ట్రీక్రి ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాఫ్ట్‌గా, ఎమోషన్‌తో నిండిన ఈ ప్రేమ గీతం ఓ ఊహించని టోన్‌ని పరిచయం చేస్తోంది. ఈ పాటకు తెలుగు లిరిక్స్‌ని రాసిన చంద్రబోస్ భావోద్వేగాన్ని అద్భుతంగా పలికించారు.



## విజయ్ సేతుపతిపై మహిళ ఫిర్యాదు

### నేనేంటో నా కుటుంబానికి తెలుసన్న సేతుపతి

ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీక్రి వచ్చి స్టార్‌గా ఎదిగారు నటుడు విజయ్ సేతుపతి. ఆయనపై ఓ మహిళ ఇటీవల సంచలన ఆరోపణలు చేసింది. కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని ఆమె సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. దీంతో ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. తాజాగా తనపై వచ్చిన ఆరోపణలపై విజయ్ సేతుపతి స్పందించారు. తన కుటుంబం ఎంతో బాధ పడిందన్నారు. ఆమెపై తన టీమ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. నన్ను ఎన్నోఏళ్లుగా చూస్తున్నవారంతా ఆమె ఆరోపణలు చూసి నవ్వుకున్నారు. నేనేంటో నాకు తెలుసు. ఈ రకమైన తప్పుడు ఆరోపణలు నన్ను బాధించలేవు. కానీ, నా కుటుంబం, సన్నిహితులు ఎంతో కలత చెందారు. 'వీటిని పట్టించుకోకండి. ఆమె ఫేమస్ కావడం కోసం కావాలని ఇలా చేస్తోంది. కొన్ని నిమిషాలపాటు- హైలైట్ అవుతుంది. పాపం ఎంజాయ్ చేయనీయండి' అని వారితో చెప్పాను. మేము ఆమెపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాం. ఏడు సంవత్సరాలుగా నేను ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. ఇప్పటివరకూ దేనికీ భయపడలేదు. ఇలాంటివి ఎప్పటికీ నన్ను బాధించవు అని విజయ్ సేతుపతి వివరించారు. కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని.. దీనివల్ల తన స్నేహితురాలు ఎంతో ఇబ్బందిపడిందని రమ్య అనే ఓ మహిళ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. విజయ్ సేతుపతి కూడా ఆమెను ఇబ్బందిపెట్టారని తెలిపింది. తన స్నేహితురాలు మానసికంగా కుంగుబాటుకు గురైందని పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే ఆమె తన పోస్ట్‌ను కొన్ని గంటల్లో డిలీట్ చేసింది. దీంతో విజయ్ అభిమానులు ఆమెపై విరుచుకుపడ్డారు. విమర్శలు నిజమైతే పోస్ట్ ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్నించారు. దీంతో ఆ మహిళ మరో పోస్ట్ పెట్టి వివరణ ఇచ్చింది. కోపంలో ఇలా చేశానని.. అది వైరల్ అవుతుందని ఊహించలేదని తెలిపింది. తన స్నేహితురాలి గోప్యత కోసం పోస్ట్ డిలీట్ చేసినట్లు- చెప్పింది.

## గొప్ప మనసు చాటుకున్న సోనూసూద్


### వృద్ధాశ్రమం ఏర్పాటు



సినీనటుడు సోనూసూద్ మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు. దేశంలో కరోనా సమయంలో ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి 'రియల్ హీరో' అనిపించుకున్న ఆయన జులై 30న 52వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈసందర్భంగా ఆయన మరో గొప్ప పనికి శ్రీకారం చుట్టారు. వృద్ధాశ్రమాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు. 500 మంది వృద్ధులకు ఇందులో ఆశ్రయం కల్పించనున్నట్లు తెలిపారు. ఎవరూ లేని వృద్ధులకు సురక్షితమైన ప్రేమతో కూడిన వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ ప్రయత్నమని చెప్పారు. వాళ్లకు కేవలం ఆశ్రయం ఇవ్వడంతో పాటు వైద్య సంరక్షణ, పోషకాహారం కూడా అందించనున్నట్లు వెల్లడించారు. మలివయసులో వారికి కావాల్సిన ఎమోషనల్ సపోర్ట్ కూడా అందించేలా వృద్ధాశ్రమాన్ని ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. దీంతో ఈ రియల్ హీరోపై మరోసారి ప్రశంసల వర్షం కురుస్తోంది. సోనూసూద్ గొప్ప మనసు చాటుకోవడం ఇదే తొలిసారి కాదు. కరోనా సమయం నుంచి ఆయన తరచూ ఇలాంటి పనులు చేస్తూనే ఉన్నారు. సినిమాలో విలన్ పాత్రల్లో నటించిన ఆయన లాక్‌డౌన్ కాలంలో వలస కూలీలను తన సొంత ఖర్చులతో సొంతూళ్లకు పంపించడం ద్వారా రియల్ హీరోగా జనం హృదయాల్లో చోటు దక్కించుకున్నారు. ఆ తర్వాత నుంచి సోషల్ మీడియా వేదికగా తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ వారికి సాయం చేస్తున్నారు. ఆయన సామాజిక సేవలకు గాను మిస్ వరల్డ్ 2025 ఫైనల్స్ వేడుకలో ప్రతిష్ఠాత్మక మానవతావాది అవార్డును అందుకున్న విషయం తెలిసిందే.

## లండన్ ఎయిర్‌పోర్ట్‌లో ఊర్వశి రౌతేలా నగలు చోరీ

లండన్‌లోని గాట్విక్ ఎయిర్‌పోర్ట్‌లో తన నగలున్న పెట్టె చోరీకి గురైందని బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. వాటి విలువ రూ.70 లక్షలుంటాయని ఆమె పేర్కొన్నారు. వింబుల్డన్ టోర్నమెంట్ వీక్షించడానికి లండన్‌కు వెళ్లిన సందర్భంలో తన నగలను బ్యాగేజీ బెల్ట్ ఏరియా నుంచి దొంగిలించారని ఆమె ఆరోపించారు. ఎయిర్‌పోర్ట్ అధికారుల నుంచి తనకు ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదని నిరాశను వ్యక్తం చేశారు. ఆమె ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. విమానాశ్రయంలో సరైన భద్రత లేకపోవడాన్ని ప్రశ్నించారు. 'ముంబయి నుంచి ఎమిరేట్స్ విమానం ద్వారా లండన్ వెళ్లాను. అక్కడ గాట్విక్ విమానాశ్రయంలోని బ్యాగేజ్ బెల్ట్ నుంచి నా లగేజీ చోరీకి గురైంది. ఈ ఘటనతో నేను వేదనకు గురయ్యాను. విమానాశ్రయ అధికారుల నుంచి కూడా నాకు సరైన సహకారం అందడం లేదు' అని ఆమె పేర్కొన్నారు. బ్యాగేజ్ ట్యాగ్ మరియు టికెట్ ఉన్నప్పటికీ, బెల్ట్ ప్రాంతం నుంచి బ్యాగ్ అదృశ్యమైందని ఆమె వాపోయారు. ఇది తీవ్రమైన భద్రతాలోపాన్ని సూచిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఊర్వశి రౌతాలా.. 'సింగ్ సాబ్ ది గ్రేట్', 'సనమ్ రే' వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com